



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 339 | ది. 27-3-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 339 | Date : 27-3-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


## ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి




**అమరావతి, మార్చి 26 (వార్తాప్రభ) :** శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీరాముడు. ఆయన అవతరించిన రోజు, ఆయన కళ్యాణం జరిగిన రోజు మనం శ్రీరామనవమి వేడుకలను జరుపుకుంటాం. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన. అలాంటి రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని, మీకు మీ కుటుంబానికి ఆ శ్రీరాముడి కృపాకటాక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శ్రీరామనవమి శుభాకాంక్షలు అన్నారు.

## దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక మహాష్టమి

### -రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారి ఘనంగా మహాష్టమి ఫలహార వేడుకలు శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. అమ్మవారి శక్తి స్వరూపమైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, మనలోని అజ్ఞానం, అహంకారం, దుర్గుణాలను తొలగించుకోవాలని సూచించారు.ఫలహార దీక్ష కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, ఆత్మలను శుద్ధి చేసే ఆధ్యాత్మిక పవిత్ర సాధనమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆచారాలు నియమశీలత, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సహకారం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ఎమ్మెల్యే అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, అదనపు డీజీపీ మహేష్ భగవత్, జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతే శాశ్వత రాజధాని..

- ఏపీ క్యాబినెట్ సమావేశం వివరాలు వెల్లరించిన మంత్రి కోలుసు పార్థసారథి

**అమరావతి ,మార్చి 26 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలే లక్ష్యంగా సుదీర్ఘంగా చర్చించి అనేక అంశాలను ఆమోదించారు. అమరావతిని శాశ్వత రాజధానిగా సుస్థిరం చేసేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం, న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ 96 కొత్త కోర్టులు, 1730 ఉద్యోగాలను సృష్టించడం, వడ్డెర సామాజిక వర్గానికి క్వారీల్లో రిజర్వేషన్లు, ఆస్తిపన్ను వడ్డీ మాఫీ వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.



**అమరావతికే శాశ్వత రాజధాని హోదా!..** అమరావతి రాజధాని విషయంలో భవిష్యత్తులో ఎలాంటి మార్పులకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా సెక్షన్ 5(2)లో "ఎట్ అమరావతి" అనే పదాన్ని, అలాగే అమరావతి అంటే ఏపీసీఆర్‌డీఏ చట్టం కింద నోటిఫై చేసిన ప్రాంతం అని స్పష్టంగా చేర్చాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో సృష్టించిన గందరగోళం పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజకీయ కక్ష సాధింపులతో రాజధానిని మార్చే దుశ్చర్యలకు పాల్పడకుండా, అమరావతిని శాశ్వత రాజధానిగా, ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి వివరించారు.


**న్యాయవ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగు..** రాష్ట్రంలో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో న్యాయవ్యవస్థను బలోపేతం చేసేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. హైకోర్టు ప్రతిపాదన మేరకు రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త కోర్టులను (అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, సివిల్ జడ్జ్ కోర్టులు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కోర్టుల నిర్వహణకు అవసరమైన 1,730 కొత్త పోస్టుల సృష్టికి కూడా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి 10 లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు ఉండాలనే నిబంధన, ఐదేళ్లకు మించి కేసులు పెండింగ్‌లో ఉండకూడదనే ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019లో ఒక్కో జడ్జిపై 963 కేసుల భారం ఉండగా, 2025 నాటికి అది 1,474 కేసులకు పెరిగిన విషయాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ 1,730 పోస్టులను త్వరలో విడుదల చేసే జాబ్ క్యాలెండర్‌లో చేర్చే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**వడ్డెరలకు చేయూత.. బీసీ వర్గాలకు ప్రోత్సాహం..** బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు చారిత్రక నిర్ణయం తీసుకుంది. వడ్డెర సంఘాలకు క్వారీ లీజులను ప్రాధాన్యత ప్రాతిపదికన కేటాయించడంతో పాటు, ప్రీమియం, సీనరేజ్ ఫీజులో 50% రాయితీ ఇవ్వడానికి రూపొందించిన మార్గదర్శకాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 15 శాతం వారికి రిజర్వ్ చేయనున్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

- బస్సులోనే 14 మంది ప్రయాణికుల సజీవదహనం
- ప్రమాద సమయంలో బస్సులో 40 మంది వరకు ఉన్నారని సమాచారం
- ప్రైవేటు బస్సు హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించిన అధికారులు





**మార్కాపురం,మార్చి 26 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు-ఢీకొన్న ఈ ప్రమాదంలో 14 మంది సజీవదహనమవ్వగా 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాద జరిగిన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారని సమాచారం. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలకల క్వారీల వద్ద టిప్పర్ - ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల నుంచి పామూరు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ప్రైవేటు బస్సు హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. వీరు కనిగిరి, పామూరు వాసులుగా గుర్తించారు. 3 అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. మంటలు చెలరేగిన వెంటనే బస్సు నుంచి 10 మంది ప్రయాణికులు హుటాహుటిన దిగిపోయారు. ప్రమాదం అనంతరం ఘటనాస్థలిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఆరా తీశారు. అదే విధంగా క్షతగాత్రులను తక్షణమే వైద్యసేవలకు తరలించేందుకు సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ప్రమాదానికి బస్సు కండిషన్ సరిగా లేకపోవడమే కారణమని ప్రయాణికులంటున్నారు. ఇదే విషయాన్ని బస్సు డ్రైవర్ తో మాట్లాడినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా యర్రగొండపాలెం వద్ద గంటసేపు బస్సును నిలిపివేసి సిబ్బంది మరమ్మతులు చేశారన్నారు. ఇదిలావుంటే ప్రమాద సమయంలో బస్సు స్టీరింగ్ స్టక్ అయిందని డ్రైవర్ చెబుతున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తెలంగాణలోని జగిత్యాల నుంచి పామూరుకు బస్సు బయల్దేరింది. ఈ క్రమంలో చీమకుర్తి నుంచి కంకర్ లోడ్‌తో మార్కాపురం వైపు టిప్పర్ వస్తుండగా ఉదయం 6 గంటల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రస్తుతం మృతదేహాలను బస్సు నుంచి ఒక్కొక్కటిగా పోలీసులు బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను బస్సు నుంచి బయటకు పోలీసులు తీశారు. మార్కాపురం బస్సు ప్రమాదంలో 13 మంది సజీవదహమవ్వగా మృతుల్లో పెదారికట్లకు చెందిన అంబటి అనిల్, అంబటి లియో, కనిగిరి మండలం చల్లగిరిగలకు చెందిన తమ్మిశెట్టి పిచ్చమ్మ, తమ్మిశెట్టి రుక్మిణి, కనిగిరి మండలం తింగారెడ్డిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి, బత్తుల పద్మ, కనిగిరి మండలం తోకంచికి చెందిన ముత్తంగి వెంకటేశ్వర్లు, పొదిలి మండలం ఉన్నగురువాయపాలెం వాసులు నర్సింగ్ ప్రభావతి, నర్సింగ్ క్షేత్ర, కనిగిరి మండలం పనుగోడుకు చెందిన దేవాండ్ల రామయ్య, అదే విధంగా బుచ్చి మండలం మంగళకట్టకు చెందిన జయరామయ్యలుగా అధికారులు గుర్తించారు.

**ఒంగోలు జీజీహెచ్ కు తరలింపు:** బస్సు ప్రమాద క్షతగాత్రులను ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తుండగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్ కు తీసుకొని వచ్చారు. ఒంగోలు జీజీహెచ్కు 12 మందిని వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న క్షతగాత్రులను జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి పరామర్శించారు. రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్కు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో వైద్యం అందించి వీలైనంత త్వరగా కోలుకునే విధంగా చూడాలని డాక్టర్లకు కలెక్టర్ సూచించారు.

**మృతులకు రూ.5 లక్షల పరిహారం:** మార్కాపురం జిల్లా రాయవరం బస్సు ప్రమాదంపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. మృతులకు కేబినెట్ లో మంత్రులంతా సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## క్రీడా స్ఫూర్తి చాటేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు

- మార్చి 28, 29న మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు జూపల్లి, వాకిటి



**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడం, క్రీడలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో తెలంగాణ లెజిస్లేచర్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల అర్గనైజింగ్ కమిటీ చైర్మన్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కో చైర్మన్ మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... నిత్యం బిజీగా ఉండే ప్రజాప్రతినిధులకు ఈ క్రీడలు ఉల్లాసం, ఉత్సాహం నింపడమే కాకుండా, రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో శాసనసభ, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు 'మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026' నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి పోటీలు తొలిసారిగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియంలో 28వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు సభ్యులందరూ పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని వయసుల వారికి క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, భాషా సాంస్కృతిక శాఖల సమన్వయంతో వివిధ క్రీడాంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతీలో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, పాల్వాయి హరీష్ రావు, ఎమ్మెల్సీలు తాత మధుసూదన్ రావు, భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ డా. సోనీ బాలాదేవి, శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.ఎస్.నెంబర్.1035/2020

బిట్వీన్ :

ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ

-------వాది

మరియు

కనల వెంకట రెడ్డి. S/O వెంకట రెడ్డి, నివాసం : డోర్ నెం.19-1-171, D-3, వినాయక నగర్, అనంతపూర్-515001, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.01-04-2026వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది..

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)

వాయిదా తేది : 01-04-2026

ఇట్లు

**కునుకు రాజశేఖర్,**
**వాది తరపు అడ్వకేట్**
**గాంధీనగర్, విజయవాడ-520003**


## వేదమంత్రాల నడుమ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### మార్చి 27న ధ్వజారోహణం






**ఒంటిమిట్ట / తిరుపతి,మార్చి 26 (వార్తాప్రభ) :** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు భక్తి భావపూర్వక వాతావరణంలో వేదమంత్రాల నడుమ గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. పురాతన చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగిన ఈ ఆలయంలో ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల దివ్య మూర్తులు వెలసి ఉండటంతో ఒంటిమిట్టను "ఏకశిలానగరం"గా కూడా పిలుస్తారు. ఈ పవిత్రక్షేత్రంలో మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో ముస్తాబైంది. గురువారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చనలను శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం 6 గంటల నుండి అర్చకుల వేదమంత్రాల నడుమ అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ వంటి శాస్త్రోక్త కర్మలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

**మార్చి 27న ధ్వజారోహణం..** శుక్రవారం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. దీంతో శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి కార్యక్రమం, కవి సమ్మేళనం జరుగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవను భక్తులు వీక్షించనున్నారు.

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్‌డ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.


## ఏపీ బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..

- మృతులకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటన

**న్యూఢిల్లీ, మార్చి 26 (వార్తాప్రభ) :** ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో భారీ అగ్నిప్రమాదం సంభవించి 12 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని పరిహారం ప్రకటించారు. "ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ప్రమాదం చాలా విషాదకరం. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని ఆయన అన్నారు.

# పిఆర్సి పై కాలహరణం సమంజసమేనా

- ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిం చిన డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీనివాస్



**విజయవాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ కుటుంబాలు ఎదురుచూస్తున్న పిఆర్సి కాల పరిమితి ఐదు సంవత్సరాలు అయితే కమిషన్ వేయడం లోనే మూడు సంవత్సరాల కాలం నష్టపోయా మని ఇది సమంజసం కాదని డెమొక్రటిక్ పి ఆర్ టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తిరువూరు లో డెమొక్రటిక్ పి ఆర్ టి యు తిరువూరు మండల శాఖ ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి శ్రీను మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాలం ఎదురు చూపుల తోనే పూర్తి అయినదని వాపోయారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ డిఏ బకాయిలు. సంపాదిత సెలవుల బకాయిలు చెల్లించాలని వేతన సవరణ సంఘం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన డెమొక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర సీనియర్ నాయకులు గోదా వెంకట రామయ్య ని నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ శ్రీనివాస్,తిరువూరు మండల శాఖ. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ లక్ష్మణరాజు, పివి రావు, సీనియర్ నాయకులు మురళీకృష్ణ, బి ప్రవీణ్,నాళ్ళ కాశి,రవికిరణ్, పలగాని కృష్ణ, తదితరుల సభ్యులు పాల్గొన్నారు.

# 'ప్రజాదర్బారు' సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

- నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలి
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు
- జి.కొండూరు ప్రజాదర్బారు కు 75 మంది అర్జీలు







**ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు,మార్చి 26 (వార్తాప్రభ) :** జి.కొండూరు:ప్రజాదర్బారు సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అధికారులను హెచ్చరించారు.సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించా రు.జి.కొండూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బారు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.వివిధ సమస్యలపై 75మంది తమ అర్జీలు ఎమ్మెల్యే కి అందజేశారు. జి.కొండూరు నుంచి కొత్తూరు వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరు చేయగా, టెండర్ దశలో ఉందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. జి.కొండూరు లో శ్మశానవాటిక కు వెళ్లేందుకు పులివాగుపై వంతెన నిర్మాణానికి రూ.65లక్షలతో ప్రతిపాదనలు పంపామని, మరో నెలలో ఇది కూడా మంజూరు అవుతుందన్నారు.జి.కొండూరు వై జంక్షన్ నుంచి తిరువూరు వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కరించేందుకు అన్ని మండల కేంద్రాల్లో వారంలో ఒక రోజు ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' కార్యక్రమ నిర్వహణ నిదర్శనమన్నారు.ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యాంగుల సర్టిఫికెట్లు మంజూరు, తాగునీటి పైప్ లైన్స్ నిర్మాణం, భూ సంభందిత సమస్యలు, రహదారుల అభివృద్ధి కోసం, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు, వివిధ రెవెన్యూ సేవలు, పోలీసు సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు.ప్రజా దర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు.అనంతరం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఎల్.ఓ.సి ని లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్, ఇంచార్జ్ తాహశీల్దార్ విజయ్ కుమార్, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో వై.బసవలింగేశ్వరరావు,ఐడీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని కూటమి నాయకు లు మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల గాంధీ, మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వర రావు,ఏ ఎం సీ మాజీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు, గ్రాంపాటి అధ్యక్షుడు పజ్జూరు విజయ్,ఎన్డీఏ కూటమి నాయకులు పటాపంచాయ నరసింహారావు యర్రబోలు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ

- చంద్రుపట్ల గ్రామ సర్పంచ్ భూబత్తుల బాలకొండయ్య



**విస్సన్నపేట,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో 10 సంవత్సరాల నుండి మండు వేసవి సమయంలో మినరల్ కూలింగ్ వాటర్ చలివేంద్రం ద్వారా ఉచితంగా ప్రజలకు అందిస్తున్నామని గ్రామ సర్పంచ్ భూ బత్తుల బాలకొండయ్య తెలిపారు. తాను సర్పంచ్ కాకముందు నుండే ఐదు సంవత్సరాలు ఉచితంగా నిర్మించానని సర్పంచిగా సేవలందిస్తున్న ప్రస్తుత ఐదు సంవత్సరాలతో పాటు రాబోయే కాలంలో కూడా పాదచారులకు వాహనదారులకు వారి దాహార్తి తీర్చే లక్ష్యంగా కూలింగ్ వాటర్ ఇవ్వటం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి పాఠశాలలకు మినీ మినరల్ వాటర్ ప్లాంట్లు ఇవ్వడం జరిగిందని అప్పటివరకు పాఠశాలలకు ఉచితంగా ఒకటవ తరగతి నుండి 8వ తరగతి 110 మంది విద్యార్థులకు రోజుకు నాలుగు క్యాన్లు వితరణగా ఇచ్చామని అదే విధంగా శ్రీరామనవమి పానకానికి మరియు అన్నదానానికి వినాయక చవితి దసరా ఏసుప్రభు సంబంధిత కోటాలు ఏర్పాటు చేసిన సమయాలలో అన్న సమారాధన కార్యక్రమాలకు కూడా ఉచితంగా నీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. కులం మతం రాజకీయాలతో సంబంధం లేకుండా సర్వ మతాలను గౌరవించే లక్ష్యంగా వారి వారి ఇష్ట దైవాలను పూజించే సమయంలో జరిగే కార్యక్రమాలకు మినరల్ వాటర్ తమ వంతు చేయూతగా ఇవ్వటం జరుగుతుందని చెప్పారు.

# అవార్డులు ఎన్ని సాధించిన తాను కూడా నిత్య విద్యార్థినే

- శ్రీ సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ మేడా మోహనరావు





**విస్సన్నపేట,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో 36 సంవత్సరాల క్రితం కేరళ టీచర్లతో రికగ్నైజ్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూలును ఒక తాటి ఆకులచే నిర్మించిన చుట్టి ఇల్లు ప్రిన్సిపాల్ రూముగా పెంకుల షెడ్లు తరగతి గదులుగా 1989 వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగిందని శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత మేడా మోహనరావు 36వ యానివర్సరీ కార్యక్రమంలో భాగంగా తెలియజేశారు. ఆనాడు ప్రస్తుతం ఉన్న అధునాతన కట్టడాలు కానీ వాహనాల రద్దీ కానీ ఇంత జనసాంద్రత కానీ లేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో మనో సంకల్పంతో ప్రథమంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆనాడు క్వాలిఫైడ్ కేరళ టీచర్లచే బోధన ప్రారంభించడానికి పరిసర ప్రాంత గ్రామాలకు సైతం వెళ్లి ఎల్ కేజీ నుండి ఇంగ్లీష్ మీడియం ప్రారంభిస్తున్నట్లు వాహన సదుపాయం అందిస్తామని ప్రచారం చేస్తూ గ్రామాలలో పిల్లలను పంపించవలసిందిగా వారి తల్లిదండ్రులను వినూత్న పద్ధతిలో కలవడం జరిగిందని చెప్పారు. ఇంగ్లీష్ మీడియం నందు చదువుకోవడం వలన తమ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుంటుందని బావి తరాలకు వారదులుగా వారు ఎదుగుతారనే ఆలోచనతో నమ్మి ఆనాడు విస్సన్నపేట శ్రీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ కు వారి పిల్లలను పంపించడం జరిగింది అన్నారు. 36 సంవత్సరాలుగా మీ మా మన శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థలను ఆదరిస్తూ ఉన్నవారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నాటి విద్యార్థులు నేడు వారి సంతానాన్ని కూడా తిరిగి విద్యార్థులుగా తమ సంస్థలలో చేర్పించడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు అన్నారు. 19 89 సంవత్సరంలో శ్రీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ నాటి కృష్ణాజిల్లా నేడు ఎన్టీఆర్ జిల్లా లోని ప్రముఖ కోఎడ్యుకేషన్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ విద్యాసంస్థ అని ఇది నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఎలైట్ స్కూలుతో కలిపి ఇంగ్లీష్ మీడియం లో స్టేట్ బోర్డు సిలబస్ తో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతూ ఉన్నది అన్నారు . ఈ పాఠశాల విస్తృతమైన మౌలిక సదుపాయాలకు మరియు క్రీడలకు ప్రసిద్ధి చెందిందన్నారు. తనకు ఇండియన్ లీడర్షిప్ అవార్డు ఇన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ న్యూఢిల్లీ, గ్లోబల్ స్పేస్ అవార్డు హైదరాబాద్ వంటి అవార్డులు ఎన్ని వచ్చిన తాను నిత్య విద్యార్థినేనని కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటాను ఆయన తెలియజేశారు . ఈనాడు కేజీ నుండి పీజీ వరకు ఎన్ని కోర్సులు అందిస్తున్న విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రుల దీవెనలు ఆ దేవుని ఆశీస్సులేనని చెప్పారు. 36 సంవత్సరాల శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల ప్రయాణంలో కొన్ని ఇబ్బందులు ఉన్న ప్రారంభంలో అన్ని తానే అయి ఇటు ప్రిన్సిపాల్ గా అటు బెల్ కొట్టే బాయ్ గా కూడా విధులు నిర్వహిస్తూ శ్రీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ను తన మానస పుత్రికగా ఎదిగేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నానని స్కూల్ వ్యాన్ కు డీజిల్ కొరకు బశీకు వద్ద క్యూ లైన్ లో నుంచున్న రోజులు కూడా ఉన్నాయన్నారు. తమ విద్యా సంస్థలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాలలో అత్యున్నత స్థాయిలో గెజిటెడ్ నాన్ గెజిటెడ్ స్థాయి లో కూడా స్థిరపడ్డారని అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో తమ సంస్థలో చదువుకున్న విద్యార్థులు ఉన్నారని విస్సన్నపేటలో కొందరు స్పెషలైజేడ్ డాక్టర్లు గా కూడా పనిచేస్తున్నారని ఒకే సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 18 మంది సాఫ్ట్వేర్లుగా అమెరికాలో 100 కిలోమీటర్ల సర్కిల్ దూరంలో ఉద్యోగాలు చేయడం జరుగుతుందని ఇటీవల ఒక పూర్వ విద్యార్థి ఈ విషయాన్ని చెప్పడం జరిగింది అన్నారు. తమ సంస్థలలో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించినందుకు సంతోషంగా ఉన్నదని ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని దండించిన వారి మేలు కోరేనని క్రమశిక్షణతోనే మంచి విద్యను అందించగలమని ఉత్తమ బోధనతోనే ఈనాడు శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులు వివిధ దేశాలలో మంచి పొజిషన్ లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు శ్రీ హర్ష, దీప్తి ప్రిన్సిపాల్ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ నాటక రచయిత, డాక్టర్ టీ తాతారావు యాదవ్ కు ఘన సన్మానం



**ఆముదాలవలస,మార్చి 26 (వార్తాప్రభ) :** ఆముదాలవలస మండలం, వెంకయ్యపేట గ్రామంలో జరిగిన "రౌడీ సింహాలు" అనే సాంఘిక నాటకానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నాటక రచయిత గుంటూరు నుండి టీ తాతారావు యాదవ్ రావడం మా గ్రామానికి మాకు ఎంతో గర్వకారంగా ఉందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. కళాయాత్ర కళలను ప్రోత్సహించటం కళాకారులు మేలుకొల్పటం అనే కార్యక్రమంలో భాగంగా తాతా రావు వెంకయ్యపేట గ్రామాన్ని సందర్శించి, కళాకారులతో మాట్లాడటం జరిగింది. అంతరించిపోతున్న కళారంగాన్ని ముందుకు తేవాలని దృక్పథంతో ప్రముఖ నాటక రచయిత చేస్తున్న ప్రయత్నానికి గ్రామ ప్రజలు పెద్దలు అందరూ సహకరిస్తామని నాటక రచయిత టీ తాతారావు యాదవ్ ని సన్మానించుకోవటం జరిగింది. ఇంకా మరెన్నో మంచి నాటకాలు మా గ్రామానికి అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని రాష్ట్ర కల్చరల్ చైర్మన్ టీ తాతారావు యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉమాశంకర్ కృష్ణ, రామారావు, రామచంద్రమాస్టర్ పాల్గొన్నారు. శ్రీరామ సందర్భంగా జలుమూరు మండలం మూకివలస గ్రామంలో రౌడీ సింహాలు నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ బహు కలలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెళ్తున్నారు.

# బాటిల్స్‌లో ఇంధనం విక్రయించకూడదు



**తిరువూరు,మార్చి 26 (వార్తాప్రభ) :** పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్ కంచి సీతారా మయ్య పెట్రోల్ బంకిలను పరిశీలించిన ఆర్డీవో ఏ కుమార్..ఈ సందర్భం గా ఆర్డీవో బంకుల నిర్వా హకులకు పలు ఆదేశాలు ఇచ్చారు. బాటిల్స్‌లో ఇంధనం విక్రయిం చకూడదని, అలాగే ఆయిల్ కంపెనీలకు సమయానికి డీడీలు చెల్లిస్తూ తగినంత ఇంధన నిల్వలు ఉంచాలని సూచించారు. ఇంధన కొరతపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సూచిస్తూ అవగా హన కల్పించారు. కార్యక్ర మంలో డిటి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు...

# కౌతవరం చానల్ తవ్వకం....



**గుడ్లవల్లేరు,మార్చి 26 (వార్తాప్రభ) :** మండలంలోని కౌతవరం చానల్ కాల్వ పూర్తిగా పూడుకుపోయింది. రైతుల కోరిక మేరకు గురువారం కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ సాగునీటి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం తమ కమిటీ తరపున ఈ కాల్వను తవ్వించారు. సాగునీటి సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమ డీసీ దోహదపడుతుందని డీసీ చైర్మన్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం





**విస్సన్నపేట,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో పద్మశాలి వీధి, బస్టాండ్ వద్ద శ్రీ కోదండ రామాంజనేయ స్వామి వారి దేవాలయం, సత్తుపల్లి రోడ్డు టర్నింగ్ శ్రీ శంకు చక్ర సహిత దాసాంజనేయ స్వామి వారి ఆలయాలలో శ్రీరామ నవమి సందర్భంగా కళ్యాణం మరియు అన్న ప్రసాద వితరణకు సర్వం సిద్ధం చేశారు. పద్మశాలి వీధి నందు మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల వెలుగులతో మామిడి తోరణాలతో స్వామివారి కల్యాణానికి శ్రీకారం చుట్టారు. బస్టాండ్ సెంటర్ నందు పచ్చని మామిడి తోరణాలతో రంగురంగుల విద్యుత్ అలంకరణలతో విగ్రహాల సుచీ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం చరిత్ర మాసం వసంత రుతువు ఉత్తరాయణం నవమి నక్షత్ర యుక్త లగ్నమందు శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగినని తెలియజేశారు.

# ఎన్.ఎం.ఎం.ఎస్ కుఐదుగురు విద్యార్థులు ఎంపిక



**హనుమాన్ జంక్షన్,మార్చి 26 (వార్తాప్రభ) :** అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు జి మాధురి శ్రీ, పి జ్యోతిర్మయి,కే అభిజిత్, జి హేమ సుభాషిని, ఎం మేదశ్రీ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్.ఎం.ఎం ఎస్ ) కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం పుష్పావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిభగల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ ప్రతి సంవత్సరం12000రూపాయలను 9వ తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారు బోయన కోటేశ్వరావు, పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ మొగంటి లక్ష్మి దుర్గ, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పడాల సత్యకుమారి పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పి పరమేశ్వరి తదితరులు పాల్గొని విద్యార్థులు అభినందించారు.

# 23 మంది వివిఆర్ కళాశాల విద్యార్థినులకు మలబార్ గోల్డ్ ఉపకార వేతనాలు




**మైలవరం,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక వేములూరు వెంకటరత్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉపకార వేతనాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళ కుమారి గురువారం తెలిపారు.కళాశాలకు చెందిన జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ విద్యార్థినులు 2025-26 విద్యా సంవత్సరానికి గాను 23 మంది మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్స్ పొందినట్లు ఆమె వెల్లడించారు.గత సంవత్సరం కంటే మూడు రెట్లు అదనంగా విద్యార్థినులు ఈ ఉపకార వేతనాలు పొందడం విశేషం.ఒక్కొక్క విద్యార్థిని రూ. 8 వేల నుంచి రూ. 10 వేలు ఉపకార వేతనాలు పొందినట్లు తెలిపారు. మహిళా సాధికారత దిశగా విద్యార్థినులకు స్కాలర్ షిప్స్ ఇస్తూ ప్రోత్సహిస్తున్న మలబార్ గోల్డ్ సంస్థను ప్రిన్సిపాల్ అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ఎక్కువ మందికి ఉపకార వేతనాలు మంజూరు చేసి వారి ఉన్నత చదువులకు సహకరించాల్సిందిగా కోరారు. సందర్భంగా మలబార్ గోల్డ్ సంస్థకు కళాశాల సిబ్బంది మరియు విద్యార్థినులు తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రూ.1.61 లక్షలతో షెడ్డు నిర్మాణానికి కృషి...



**గుడ్లవల్లేరు,మార్చి 26 (వార్తాప్రభ) :** మండలంలోని అంగలూరు గ్రామ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం చేయుటకు చక్కని షెడ్ ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం చేతన ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఎల్మాస్ మాగ్నెటిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సిహెచ్ మురళి, మాలతి రూ. 1.61లక్షలతో నిర్మాణం చేయించారు. ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ హెచ్ఎం పి రాజేంద్రప్రసాద్ రిటైర్డ్ డివైఓ సుగుణ కుమారి, ఆలయ చైర్మన్ తిపిరినేని రాజబాబు, సాయిబాబు ట్రస్ట్ అంగలూరు వారు నిరంతరం పర్యవేక్షిస్తూ విశేష కృషి చేశారు. ఈ షెడ్‌ను గురువారం ప్రారంభించి పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేనేపల్లి రవి కుమార్, ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుగ్గిరాల శేషుబాబు, ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ కొల్లి శ్రీనివాసరరావు, ఆ కళాశాల కమిటి చైర్మన్ లక్ష్మీ నారాయణ, ఇంచార్జ్ డైట్ ప్రిన్సిపల్ వినయ్ కుమార్, హెచ్ఎం జగన్ మోహన్ రావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పరీక్షలు



**తిరువూరు,మార్చి 26 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ క్రియేటివ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సుమారు 650 మంది విద్యార్థులకు డాక్టర్ వై జగన్మోహన్ రావు మెమోరియల్ చైల్డ్ ఐ కేర్, కొండపల్లి వారు సాంకేతిక సహకారం తో ఉచితంగా కంటి పరీక్షలు చేయడం జరిగింది. వారిలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రమైన కంటి సమస్యలు గుర్తించడమైనది. వారికి ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 11 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు లయన్స్ క్లబ్ ద్వారా అందజేయగలము. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పివి రావు, సెక్రెటరీ లయన్ చలమాల శంకర్ రావు, జీఎస్టీ కోఆర్డినేటర్ లయన్ అడ్వకేట్ కంచర్ల ముత్య ప్రసాద్ పాల్గొన్నారు.

## అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం!!

● మౌలిక సదుపాయాల బలోపేతం ● అదనపు యంత్రాల ఏర్పాటు ● వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండాలి ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం జనరల్ ఆసుపత్రిని గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అదనపు పరికరాల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగాలు, క్రిటికల్ కేర్ సెంటర్, ఎస్.ఎన్.సి.యూ, ఎక్స్ రే, అల్ట్రా సౌండ్, ఫిజియోథెరపీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆసుపత్రిలో అదనంగా ఒక ఎక్స్ రే మెషీన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఏర్పాటు చేయాలని, ఫిజియోథెరపీ విభాగం నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించాలని సూచించారు. సదరం విభాగంలో చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## శేరిలింగంపల్లి లో అసంపూర్తిగా మిగిలిన లింకు రోడ్లను తక్షణమే పూర్తి చేయండి

**-ప్రభుత్వానికి ఎమ్మెల్యే గాంధీ వినతి**



**శేరిలింగంపల్లి,మార్చి 26 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన లింక్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ గురువారం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో భారీ జనాభా మరియు తీవ్ర ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని పలు కీలక లింక్ రోడ్ల పనులు గతంలో మంజూరై సగం వరకు పూర్తి అయినప్పటికీ, భూసేకరణ సమస్యలు మరియు అధికారుల కొరత కారణంగా నిలిచిపోయాయని తెలిపారు.పూర్తి చేయాల్సిన ప్రధాన పనులు:హైటెక్ సిటీ గౌసియా కేఫ్ నుండి కొత్తగూడా హర్ష టాయోట వరకు 100 అడుగుల రహదారిలి అపర్ణ హిల్ పార్క్ నుండి గంగారాం చెరువు వద్ద హనుమాన్ దేవాలయం ద్వారా జాతీయ రహదారికి లింక్ రోడ్డులి నల్లగండ్ల రత్నదీప్ సూపర్ మార్కెట్ నుండి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు లింక్ రోడ్డు లి ముంబాయి జాతీయ రహదారి ( ఎన్ హెచ్ -65) పై హోమ్ జ్యూవెల్ నుండి రైల్వే ట్రాక్ మీదుగా జోనల్ కార్యాలయం వరకు ఫ్లైఓవర్ మరియు లింక్ రోడ్డుఈ పనులను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన అధికారులను నియమించి ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.ఈ లింక్ రోడ్లు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రజలకు సమయం మరియు ఇంధన వ్యయం ఆదా అవుతుందని,ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని గాంధీ పేర్కొన్నారు.

## పోటీతత్వమే తొలి గెలుపు!!




అడుగు ముందుకు వేస్తేనే కదా.. గమ్యం చేరే దారి,
పోటీలోన దూకితేనే కదా.. దొరికేటి విజయ భేరి!!
నీలో ఉన్న నిప్పును రగిలించే గొప్ప ఆయుధం,
నిరంతరం నిన్ను కదిలించే విజయ నాదం!!
ఒంటరిగా నడిస్తే రాదు ఏనాటికీ గుర్తింపు,
నలుగురితో తలపడితేనే కలుగును ఆ సంతృప్తి!
ఎదురుగాలి వీచినా నీవు సాగాలి ముందుకు చూసి,
లక్ష్యాన్ని చేరాలి నీవు శ్రమను తోడు చేసి!!
ఓటమి ఎదురైనా అది నీకు ఒక పాఠం,
మళ్ళీ పోరాడమని చెప్పే విజయ సంకేతం!
స్తబ్ధతగా ఉంటే జీవితం ఒక నిలిచిన నీరు,
పోటీతో కదిలితేనే మారుతుంది నీ తీరు!!
భయం వీడి పరుగెత్తు పందెపు గుర్రమై,
లోకాన్ని జయించు నీవు ఒక శిఖరమై!
సాధించాలనే తపనే నీకు అసలైన బలం,
శ్రమకు ప్రతిఫలం దక్కుతుంది ఏదో ఒక కాలం!!
పోటీయే నిన్ను మెరుగుపరిచే పదునైన కత్తి,
అదే నీలో నింపుతుంది అలుపెరగని శక్తి!
మొదటి అడుగు వేయడమే నీ మొదటి గెలుపు,
ఆపై విజయమే నిన్ను వెతుక్కుంటూ వచ్చే పిలుపు!!

**గడ్డం సంతోష్ రాజ్**

**గోదావరిఖని**

# జిడికె-2ఏ గనిపై హెచ్ఎంఎస్ గర్జన!!

● సింగరేణి కార్మికుల గోడు పట్టించుకోరా ● బరువు పెరిగిన రెల్స్.. పెరిగిన కార్మికుల కష్టాలు ● వేజ్ ప్రొటెక్షన్ లేకపోతే సీనియర్ కార్మికులకు తీవ్ర ఆర్థిక నష్టం ● విజిలెన్స్ పేరిట మారు పేర్ల ఫైళ్ల పెండింగ్ ● శిక్షణ పూర్తయిన వారికి వెంటనే ఆఫీస్ ఆర్డర్లు ఇవ్వాలి ● హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం డివిజన్ పరిధిలోని జిడికె-2ఏ ఇంక్లైన్ గనిపై గురువారం హెచ్.ఎం.ఎస్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికుల సమస్యలపై గళమెత్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హెచ్.ఎం.ఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.....సింగరేణి యాజమాన్యం కార్మికుల కష్టాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా లైన్ మెన్ కార్మికులకు గతంలో సరఫరా చేసిన 30ఎల్.పి. రెల్స్ స్థానంలో ఇప్పుడు భారమైన 40ఎల్.పి. రెల్స్ ఇవ్వడం వల్ల పని భారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పాత పద్ధతినే పునరుద్ధరించాలని కోరారు. అలాగే గనిలోని ఎస్ డి ఎల్ యంత్రాలకు అవసరమైన స్పేర్ పార్ట్స్ కొరతను తీర్చాలని, విజిలెన్స్ పేరుతో పెండింగ్‌లో ఉన్న మారు పేర్ల ఫైళ్లను వెంటనే క్లియర్ చేసి అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. మెడికల్ ఫిట్ అయ్యి ఎంవిటిసి, అండర్ గ్రౌండ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి జాప్యం లేకుండా ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయాలని హితవు పలికారు. అండర్ గ్రౌండ్ నుండి సర్ఫేస్‌కు వెళ్లే సీనియర్ కార్మికులకు ఒకటవ కేటగిరీ ఇవ్వడం వల్ల వారి బేసిక్ తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారని, వారికి తప్పనిసరిగా 'వేజ్ ప్రొటెక్షన్' కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ అరెల్లి పోషం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ పల్లె క్రాంతి కుమార్, జాయింట్ సెక్రటరీ దెబ్బెట సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమార్, పిట్ కార్యదర్శులు రాంచందర్, వరప్రసాద్ మరియు జి.స్వామి, బి.సతీష్, కె.సత్తయ్య, ఖలీల్, రాహుల్ వంటి పలువురు నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ బంపర్ ఆఫర్!!

● గోదావరిఖని నుండే అయోధ్య, కాశీ యాత్ర ● రోజుల్లో ముఖ్య పుణ్యక్షేత్రాల సందర్శన ● రాజధాని ఏసీ బస్సులో సుఖవంతమైన ప్రయాణం ● డిపో మేనేజర్ ఎం.నాగభూషణం

**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**ఆర్టీసీ సంస్థ గోదావరిఖని డిపో నుండి అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక 'రాజధాని' ఏసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక బస్సు 2026 మార్చి 28వ తేదీ శనివారం మధ్యాహ్నం 1గంటకు గోదావరిఖని నుండి బయలుదేరుతుంది. ఈ సుదీర్ఘ యాత్రలో భాగంగా ప్రయాణీకులు మైహార్, ప్రయాగ్‌రాజ్, అయోధ్య, కాశీ, రాంటెక్, చాందా మహంకాళి వంటి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించవచ్చు. యాత్ర పూర్తయ్యాక తిరిగి ఆరో రోజున బస్సు గోదావరిఖనికి చేరుకుంటుంది. ఈ యాత్రకు సంబంధించి టికెట్ ధర పెద్దలకు రూ. 7,800గాను, పిల్లలకు రూ. 6,500గాను నిర్ణయించారు. భక్తులు, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం ప్రకటనలో కోరారు. బుకింగ్, ఇతర పూర్తి వివరాల కోసం 7013504982 లేదా 7382847596 నంబర్లను సంప్రదించవచ్చు. మారుతున్న కాలానికి




అనుగుణంగా ఆర్టీసీ కల్పిస్తున్న ఈ ఏసీ బస్సు ప్రయాణం భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది.

# వలస కార్మికుల సంక్షేమమే లక్ష్యం!!

● కార్మికులకు కుల ధ్రువీకరణ కల్పించాలి ● వలస కార్మికుల బిడ్డల చదువుల కోసం చొరవ తీసుకోవాలి ● ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులపై పోలీస్ వెరిఫికేషన్ భారం తగ్గించాలి ● కార్మికుల నుండి రూ. 1500 వసూలా? ఇది సమంజసం కాదు ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ....గత 50 ఏళ్లుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇక్కడి పరిశ్రమల్లో కూలీలుగా మగ్గుతున్న నిరుపేద కుటుంబాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, అలాగే వారి పిల్లలకు ఉన్నత చదువుల్లో రిజర్వేషన్లు లభించి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఎన్టీపీసీ వంటి భారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కూడా ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ పేరుతో కార్మికుల నుండి 1500 రూపాయల వరకు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కార్మికులపై ఈ ఆర్థిక భారం పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను సరళీకృతం చేసి కేవలం సాధారణ రుసుముతోనే సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# అపిటోరియా ఫార్మాలో భద్రతా ప్రమాణాలు సంతృప్తికరం

● సంగారెడ్డి జిల్లా ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గౌరీ శంకర్

● అపిటోరియా ఫార్మాలో ఘనంగా 55వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు






**కుత్బుల్లాపూర్, మార్చ్ 26, (వార్తాప్రభ) :** ఐడీఏ పాశమైలారంలోని అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ (యూనిట్-5)లో 55వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గౌరీ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రతా ప్రమాణాల విషయంలో అపిటోరియా యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఏదైనా పని గురించి సరైన అవగాహన లేనప్పుడు సొంత నిర్ణయాలు తీసుకోవద్దు. అర్థం కాని పనిని వెంటనే సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకోవాలి. అవగాహన లేని పనులకు దూరంగా ఉండటమే ప్రాణ రక్షణకు మార్గం" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైట్ హెడ్ (వైస్ ప్రెసిడెంట్ - ఆపరేషన్స్) నాగ శేషయ్య, కార్పొరేట్ ఈహెచ్ఎస్ హెడ్ (సీనియర్ వైస్ ప్రెసిడెంట్) తపస్ సాహా, క్లస్టర్ ఈహెచ్ఎస్ హెడ్ (జనరల్ మేనేజర్) అమర్ కుడాలే మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ భద్రతా పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ వేడుకలో కంపెనీ ఉద్యోగులు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కదులని కారు.. కరువైన నిఘా.

**ఐదేళ్లుగా తిష్టవేసిన పాత కారు..**

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్పు**



**కూకట్ పల్లి, మార్చి 26(వార్తాప్రభ):**వివేకానంద నగర్ కాలనీలో గల వినాయక పార్కు సమీపంలో గత ఐదేళ్లుగా తిష్టవేసిన ఒక పాత కారు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారును అక్కడ వదిలివెళ్లగా, ఇప్పటివరకు దానిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.ప్రస్తుతం ఈ కారు పూర్తిగా ధ్వంసమై అస్థిపంజరంలా మారింది. కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ఇప్పటికే పగులగొట్టారు.ఈ వాహనం కేవలం చెత్తాచెదారానికే కాక, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చీకటి పడితే చాలు మందుబాబులు, ఆకతాయిలు ఈ కారు చాటున చేరుతున్నారని ఫిర్యాదు చేస్తున్నారు.స్థానిక పోలీస్ యంత్రాంగం మరియు మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, యజమానిని గుర్తించాలని లేదా ఆ వాహనాన్ని అక్కడి నుండి తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

## వదంతులు నమ్మకండి!!

● పుష్కలంగా ఇంధన నిల్వలు ● క్యాన్లలో నింపొద్దు - రద్దీ పెంచొద్దు ● సోషల్ మీడియా వదంతులపై నిఘా ● శాంతిభద్రతలే ముఖ్యం ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో పెట్రోల్, డీజిల్ ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాల వల్ల వాహనదారులు ఒకేసారి బంకులకు చేరుకుని ఫుల్ ట్యాంకులతో పాటు క్యాన్లు, టిన్లలో అదనంగా నిల్వ చేసుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడి సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత స్టాక్ అందుబాటులో ఉందని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన వివరించారు. ప్రజలు తమ అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. నిర్ధారించని సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ గందరగోళం సృష్టించే వారిపై, వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## డిగ్రీ చదువుతోనే నెలకు 24వేలు!!

● అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సరికొత్త ప్రోగ్రామ్
● బి.ఎ, బి.కామ్, బి.ఎస్సీ (ప్రథమ ఒ ద్వితీయ సంవత్సరం) విద్యార్థులు అర్హులు ● వృత్తి నైపుణ్యాల శిక్షణతో పాటు స్టైపెండ్, ఉద్యోగ అవకాశం ● కస్టమర్ సపోర్ట్, ఫైనాన్స్, బిజినెస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ విభాగాలు

**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం (కోడ్ 055) విద్యార్థుల కోసం ఒక అద్భుతమైన అవకాశాన్ని ప్రకటించింది. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.ఎ, బి.కామ్, బి.ఎస్సీ విద్యార్థుల కోసం "టీసిఎస్ - ఐ ఆన్ జాబ్ అచీవర్ బిజినెస్ ఆపరేషన్" అనే సరికొత్త ప్రోగ్రామ్‌ను విశ్వవిద్యాలయం రూపొందించింది. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలతో పాటు పరిశ్రమల్లో నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, చదువుకుంటూనే నెలకు కనిష్టంగా 24,000 రూపాయల వరకు వేతనం పొందే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో స్టైపెండ్‌తో కూడిన విద్య, ఇండస్ట్రీ ప్రాజెక్టులలో పని చేసే అవకాశం, కస్టమర్ సపోర్ట్, ఫైనాన్స్, బిజినెస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ పథకంపై అవగాహన సదస్సును ఈ నెల 29 ఆదివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు విచ్చేయనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరిశ్రమల్లో గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందజేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా, కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## జిల్లా వైద్య శాఖాధికారిణి ని మర్యాదపూర్వకంగా కలిసిన డా.వెంకట రెడ్డి



**శేరిలింగంపల్లి,మార్చి 26 (వార్తాప్రభ):**రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శాఖాధికారిణి డాక్టర్ కే.లలిత దేవిని టీఆర్‌పీఎస్ వైద్య సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.వెంకట్ రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హాఫిజ్‌పేట్, కొండాపూర్,మాదాపూర్,మియాపూర్ ,మణికొండ ,నానాక్రామ్‌గూడా ,గోపనపల్లి,గచ్చిబౌలి ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్ఎంపీ,పీఎంపీ వైద్య సేవకుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు,సౌకర్యాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.

# ఎడిటోరియల్

## జగన్ కమ్మని ప్రేమ...తట్టుకోగలరా ?

వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ గురించి చెప్పాలంటే విభిన్నమైన రాజకీయ నేతగానే చూడాలి. ఆయన వైఎస్సార్ వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించినా తనదైన పోకడలతోనే ముందుకు సాగారు. 2019లో వైసేపీకి 151 సీట్లతో అధికారం దక్కింది. దానికి కారణం అన్ని సామాజిక వర్గాలు గుత్త మొత్తంగా ఓట్లేసి గెలిపించడమే. చిత్రమేంటి అంటే టీడీపీని ఎక్కువగా అభిమానించే కమ్మ సామాజిక వర్గంలోని వారు కూడా గుర్తించతగిన సంఖ్యలో మద్దతుగా నిలిచారు. అందువల్లనే కృష్ణా గుంటూరు వంటి టీడీపీ హార్డ్ కోర్ జిల్లాలలో వైసీపీ సునాయాస విజయం సాధ్యమైంది అని విశ్లేషణలు ఉన్నాయి. అయితే వైసీపీ పవర్ లోకి వచ్చాక అమరావతి రాజధాని విషయంలో ఉదాశీనత చూపించడంతో మొదలైంది. ఆ తరువాత కమ్మల పట్ల కూడా కొంత దూరం పెట్టే రాజకీయం చేశారు అన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. మంత్రి వర్గంలో ఎపుడూ కమ్మలకు స్థానం ఉంటుంది. అలాంటిది మొదటి విడతలో కొడాలి నానికి చాన్స్ ఇచ్చినా విస్తరణలో ఆ సామాజిక వర్గమే లేకుండా చేయడంతో వారిలో అది భారీ అసంతృప్తికి వైసీపీ మీద ఆగ్రహానికి కారణం అయింది. అంతే కాదు కమ్మల రాజకీయ ప్రాబల్యం ఉన్న చోట సామాజిక ప్రయోగాలు చేయడం కూడా మంటగా మారింది. ఇలా వారి విషయంలో ఎందుకో అప్పట్లో ఒక రకమైన గ్యాప్ పెంచేశారు అని చెప్పుకున్నారుఈ క్రమంలో కమ్మలు కాపులు బీసీలు ఇలా ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు అంతా తలా ఒక చేయి వేసి మరీ వైసీపీ భారీ ఓటమికి కారణం అయ్యారు. ఇక వైసీపీ ఓటమి తరువాత మెల్లగా అసలు విషయాలు ఆ పార్టీ పెద్దలకు అర్థం అవడం మొదలయ్యాయని అంటున్నారు. కాపులను దగ్గర చేసుకుంటూ వస్తున్న వైసీపీ ఇపుడు కమ్మల మీద కూడా అవ్యాజమైన ప్రేమను చూపిస్తోంది అని అంటున్నారు. వారికి గుర్తించి గౌరవించడం మీద చర్చ అయితే సాగుతోంది. భారీ హామీలతో రానున్న ఎన్నికల్లో కమ్మలకు సముచితమైన ప్రాధాన్యత ఇవ్వడానికి వైసీపీ అధినాయకత్వం డిసైడ్ అయింది అని అంటున్నారు. తాజాగా ఒంగోలులో వైసీపీ ఒక ప్రయోగం చేసింది. ఆ సీటుని ఎపుడూ బాలినేని శ్రీనివాసరెడ్డికే ఇస్తూ వచ్చింది. ఆయన చూస్తే జనసేనలోకి వెళ్ళారు దాంతో మరో రెడ్డికే అక్కడ సీటు ఇస్తారని అంతా అనుకుంటున్న వేళ కమ్మ సామాజిక వర్గానికి చెందిన చుండూరు రవికి పగ్గాలు ఇవ్వడంతో సర్వత్రా చర్చ సాగుతోంది. టీడీపీ నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన దామచర్ల జనార్ధన్ ఎమ్మెల్యేగా ఉన్నారు. వైసీపీ కూడా అదే సామాజిక వర్గాన్ని దగ్గరకు తీయడాన్ని కొత్త వ్యూహంగా చూస్తున్నారు. ఇక దేవినేని అవినాష్ ని ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ గా నియమించిన వైసీపీ రానున్న కాలంలో ఆయనకు కోరుకున్న చోట ఎమ్మెల్యే సీటు ఇస్తామని అంటోంది. గుడివాడ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి కొడాలి నానికి ప్రయారిటీ ఇస్తూనే మరింతమందిని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. గన్నవరం టికెట్ ని వంశీకి మరోసారి ఇచ్చేందుకు రెడీగా వైసీపీ ఉంది. అలాగే గుంటూరు జిల్లాలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే బోళ్ళ బ్రహ్మనాయుడుని సైతం ప్రోత్సహిస్తోంది. ఇంకా అనేక మందికి ఈసారి పార్టీ పరంగా ప్రోత్సహించి పెద్ద పీట వేయాలని వైసీపీ వ్యూహ రచన చేస్తోంది అని అంటున్నారు. కమ్మలకు బలమైన కోటలుగా ఉన్న నియోజకవర్గాలలో వారికే టికెట్లు ఈసారి ఇచ్చేలా యాక్షన్ ప్లాన్ ఉంటుంది అని అంటున్నారు. దాంతో పాటుగా కొత్తగా సీట్లు పెరుగుతాయి కాబట్టి మరిన్ని అవకాశాలు అంటున్నారు. మరి వైసీపీ చేస్తున్న ఈ సామాజిక ప్రయోగం కానీ కమ్మనైన ప్రేమలు కానీ ఏ విధంగా వర్కౌట్ అవుతాయి ఏ రకమైన ఫలితాలు వస్తాయన్నది చూడాల్సిందే అంటున్నారు.

## కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించండి!



**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరం రోజు రోజుకు జన సాంద్రత పెరిగి చెత్త సేకరణ కూడా ఎక్కువగా ఉంటుంది. కానీ పెరుగుతున్న జనాభా, నగర విస్తీర్ణకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య మాత్రం పెరగటం లేదని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా విమర్శించారు. గురువారం ఉదయం సత్యనారాయణ పురం 28వ డివిజన్ లోని సానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం రాజధాని అవటంతో ప్రతిరోజు ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమాలు ఉంటున్నాయని, దీంతో పారిశుద్ధ్య కార్మికులకు అదనంగా బాధ్యతలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు రిటైర్మెంట్ అయిన, చనిపోయిన, అనారోగ్య కారణాలతో ఖాళీ అయిన వారి సంఖ్య వందలలో ఉందని అన్నారు. గతంలో కంటే తగ్గిన కార్మికుల సంఖ్య కూడా పూర్తి చేయలేదని అన్నారు. వెంటనే కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్ వి ఎస్ చలం తదితరులు ఉన్నారు.

## త్యాగమూర్తి తండ్రి

త్యాగానికి మరోపేరు
నాన్న గారు జగతిలో
మహోన్నతం వారి తీరు
గౌరవించు మనసులో
తలపించును స్వర్గమే
నాన్న ఉన్న ఇంటిలో
కుటుంబానికి దుర్గమే
ధ్రువతార మింటిలో
నడిపించే నాయకుడు
కాంతులీను మార్తాండుడు
బాధ్యతగల సైనికుడు
కుటుంబ సంరక్షకుడు
నిరంతర శ్రామికుడే
చూడంగా భగవంతుడు
స్వచ్ఛమైన ప్రేమికుడే
నాన్న కడు పూజనీయుడు



-గద్వాల సోమన్న,
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# నేడు కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి ఆలయంలో వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం







**విజయవాడ పశ్చిమ మార్చి 26:(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారామ స్వామి వార్ల కళ్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మ వార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి) చెప్పారు. గురువారం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీరామనవమి ఉత్సవాలను ప్రతి ఏటా అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు వారు వివరించారు. దీనిలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సీతారామస్వామి వార్ల కళ్యాణోత్సవం జరుగుతుందని, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, విజయవాడ పశ్చిమ సభ్యులు వై. సుజనా చౌదరి తదితర ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. అలాగే 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు వన్ టౌన్ పురవీధుల్లో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహిస్తామని చెప్పారు. 102 సంవత్సరాల చరిత్ర గల ప్రత్యేకమైన రథంపై శ్రీ సీతారామ స్వామివార్లను ఊరేగించడం జరుగుతుందన్నారు. అలాగే 30వ తేదీన సాయంత్రం స్వామివారి పవళింపుసేవ జరుగుతుందని వారు వివరించారు. సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, అధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, నరసింహారావు,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాక్షి దినపత్రిక కాపీలు దగ్ధం

- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై అవాస్తవ వార్తల ప్రచురుణపై తెదేపా శ్రేణుల ఆగ్రహం
- 24 గంటల్లో సాక్షి యాజమాన్యం ఎంపీ కేశినేని చిన్నికి క్షమాపణ చెప్పాలి
- పత్రికా విలువలను గాలికొదిలేశారని విమర్శించిన టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా





**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పత్రికా విలువలను గాలికొదిలేసి, వైసిపి వర్గ ప్రయోజనాల కోసం అవాస్తవాలను ప్రచురిస్తున్న 'సాక్షి దిన పత్రిక తీరుపై విజయవాడలో టిడిపి శ్రేణులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు . సాక్షి పత్రిక వై ఎస్ ఆర్ సి పీ కరపత్రంలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను రాజకీయంగా ఎదుర్కొలేక ఆయనపై బురద జల్లడమే పనిగా పెట్టుకుందంటూ ఆరోపించారు. కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడి ఫోన్ కాల్ డేటా రికార్డులు చేయిస్తున్నారంటూ సాక్షి దినపత్రికలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) పరువుకు భంగం కలిగేలా వచ్చిన అసత్య కథనంను నిరసిస్తూ సాక్షి పత్రిక కాపీలను తగలబెట్టి నిరసన తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వన్టౌన్ గణపతిరావు రోడ్డులో గల ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద సాక్షి దినపత్రికలో వచ్చిన అబద్ధపు కథనాలను కండిస్తూ గురువారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సాక్షి రాతలను ఖండిస్తూ పత్రిక ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా మాట్లాడుతూ....విజయవాడ పార్లమెంట్ స్థానంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) 2.85 లక్షల భారీ మెజారిటీతోనూ, పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుజనా చౌదరిని 50 వేల పైబడి మెజారిటీతోనూ గత ఎన్నికల్లో ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు . గెలిచిన నాటి నుంచే పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి సఖ్యతతో పనిచేస్తున్నారన్నారు. కూటమి పార్టీల సఖ్యత, గడచిన ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేల అఖండ విజయాన్ని జీర్ణించుకోలేక వైసిపి తమ కరపత్రిక సాక్షి దినపత్రికలో అవాస్తవ కథనాలను పదే పదే ప్రచురిస్తుందన్నారు. ఎంపీ కేశినేని చిన్నికి లభిస్తున్న ప్రజాధరణ చూడలేక వైసిపి నాయకుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి భార్య భారతీ రెడ్డి ఎండీగా ఉన్న సాక్షి పత్రిక వేదికగా వార్తల రూపంలో అవాస్తవాలను అల్లుతున్నారని విమర్శించారు . ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు సృష్టించేందుకు 'కాల్ లిస్టు పేరిట అడ్డగోలు కథనాలు రాస్తున్నారన్నారు. ప్రజా నాయకులుగా ఉన్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనాచౌదరితో పాటుగా కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని దెబ్బతీసేందుకు సాక్షి పత్రిక ప్రయత్నిస్తోందని, కానీ అటువంటి రాతల వల్ల కూటమి నేతల వేగం తగ్గదని హెచ్చరించారు. సాక్షి పత్రికలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై రాసిన వార్త పూర్తిగా అవాస్తవమన్నారు. పత్రికలో వార్త రాసేటప్పుడు తగిన ఆధారాలు ఉండాలన్నారు. ఎమ్మెల్యే సన్నిహితుల కాల్ డేటా రికార్డులు ఎంపీ చిన్ని సేకరిస్తున్నారని ఆరోపణతో సాక్షిలో వార్త రాశారని, అందుకు ఆధారాలు ఉంటే సాక్షి యాజమాన్యం వెంటనే బయట పెట్టాలన్నారు. ఆధారాలు లేకుండా వార్తలు రాయడం పత్రికా ధర్మం కాదన్నారు. పత్రికా ధర్మంను పాటించని వైసిపి కరపత్రిక సాక్షి దినపత్రిక యాజమాన్యం తగిన ఆధారాలు చూపక పోతే 24 గంటల్లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కు బేషరతులగా క్షమాపణలు తెలపాలన్నారు. లేని పక్షంలో ప్రజాగ్రహంకు గురికాక తప్పదన్నారు. టిడిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు షేక్ ఆశ , మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి)మాట్లాడుతూ....అవాస్తవ కథనాల ద్వారా ఎంపీ కేశినేని చిన్ని ప్రతిష్టకు భంగం వాటిల్లేలా సాక్షి పత్రిక యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే సాక్షి యాజమాన్యం ఎంపీ చిన్నికి క్షమాపణలు చెప్పక పోతే సాక్షి కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. గౌరవ ఎంపీ కేశినేని చిన్నిపై అవాస్తవ కథనాలను రాసిన సాక్షి యాజమాన్యం, వార్త రాసిన విలేకరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను, ప్రెస్ కౌన్సిల్ను కోరుతున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జగన్మోహనరావు, మార్కెట్ యార్డ్ కమిటీ ఉపాధ్యక్షులు పాల మాధవ్, 55వ డివిజన్ అధ్యక్షులు ఎండి జాహిద్ , ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు, క్లస్టర్ కరీముల్లా, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు షేక్ నసీమా, ప్రధాన కార్యదర్శి పితాని పద్మ 42వ డివిజన్ అధ్యక్షులు పత్తి నాగేశ్వరరావు, టిడిపి జిల్లా కార్యదర్శి పిల్లా శ్రీనివాసరావు (పీసీ ), మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ అన్సార్, ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, 45వ డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, 49వ డివిజన్ అధ్యక్షులు బడుగు వెంకన్న , 43 డివిజన్ అధ్యక్షులు మోర బోయిన రాంబాబు , 35వ డివిజన్ అధ్యక్షురాలు బుదాల నంద కుమారి, మైనారిటీ నాయకులు ఎండి ఇస్మాయిల్ జబీబుల్లా , సయ్యద్ అలీ, పశ్చిమ నియోజకవర్గం ఐ టి డి పి అధ్యక్షులు చైతన్య, పార్టీ నాయకులు ధనాల శీను, మోడీ రాజు, లక్కు శాంతి, రోహిణి ప్రియ, దుర్గ, స్రవంతి , కసింకోట మల్లేశ్వరి , ఎర్రం శెట్టి పద్మ కుమారి, అపర్ణ , మౌనిక, లక్ష్మి, పట్నాల భార్గవి, కొట్టేటి సరిత, మున్నిసా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ సన్నిధిలో చండీ యాగం

పెనుగంచిప్రోలు, మార్చి 26( వార్త ప్రభ ) పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి దేవస్థానం లో గురువారం చండీ యాగం నేత్ర పర్వంగా సాగింది. నూతన సంవత్సరం లో మొదటి ఆ ష్ట మి కావడం తో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు,



జగ్గయ్యపేట. సి ఐ. వెంకటేశ్వర రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్ బాబు, దంపతులు శాస్త్రో క్తం గా పూజలు నిర్వహించారు,లోక కళ్యాణార్థం సాగిన ఈ యాగం అనంతరం భక్తుల కు తీర్థప్రసాదాలు పంపిణీ జేశారు,ఆలయ ప్రాంగాణం అధ్యా త్మి క శోభతో విరాజిల్లింది..వచ్చిన భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈ ఓ.బి మహేశ్వర రెడ్డి, ఆలయ ఎ ఈ ఓ జంగం శ్రీనివాసరావు లు పర్యవేక్షణ చేశారు.. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్ డెంట్ రాజు,ఇన్స్పె క్ట ర్లు తుంగ శశి కుమార్, బత్తుల కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు,

## అలరించిన నృత్య జానపద నాటక ఉత్సవాలు



**హైదరాబాద్ :మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** ధాత్రి సంక్షేమ సంఘం ధాత్రి కళాంజలి సేవా సాంస్కృతిక సంస్థ 24వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించు ఆదిశంకరాచార్య అద్వైత తత్వం పైన సంగీత నృత్య జానపద నాటక ఉత్సవాలలో రెండవ రోజు కార్యక్రమంగా అన్నమాచార్య కీర్తనలు ప్రేమకు పరాకాష్ట రవి అండ్ రవి ఆర్ట్స్ వారితో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పీఠా ధి పతిరాగాల నాగేశ్వరరావు, విశిష్టత ఇది అత్తలూరు విజయలక్ష్మి సంస్థ స్థాపకురాలు డాక్టర్ జి శాంతకుమారి, తిరుమల శ్రీ ప్రేమకు పరాకాష్ట నాటికలు మాడుగుల కృష్ణమోహన్, భానుప్రియ రమేష్, రామాయణం సత్యనారాయణ శివరామకృష్ణ, నటీ నటులు పాల్గొన్నారు.

### మీ సమస్యను నాతో నేరుగా చెప్పాలంటే మంగళ, గురువారాల్లో వీఎంసీ ప్రధాన కార్యాలయంలో

## అందుబాటులో ఉంటాను

**విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ మరియు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రతి మంగళవారం మరియు గురువారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల స్పెషల్ ఆఫీసర్ ఛాంబర్ లో అందుబాటులో ఉంటారని నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ మరియు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్య నేరుగా తనకి తెలియజేయాలన్న, కలవాలనుకున్న ఎప్పుడు ఎక్కడ ఉంటారో, ఎప్పుడు కలవాలో అన్న సందేహం లేకుండా ప్రజల సౌకర్యార్థం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఛాంబర్ లో ప్రతి మంగళవారం మరియు గురువారం అందుబాటులో ఉంటారని, ప్రజలు మంగళవారం, గురువారం కోసమే వేచి ఉండకుండా తమను కలవాలనుకుంటే కలెక్టరేట్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు.

## మీ అబద్దపు రాతలతో మా ప్రజా నాయకుడిని దెబ్బ తీయలేరు!

● నమ్మి భాను ప్రకాష్ యాదవ్




**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గ మాజీ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్ వారి కార్యాలయంలో జరిగిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ! "సాక్షి" పత్రికలో విజయవాడ ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ (చిన్నీ) పై వచ్చిన వార్త పూర్తిగా అసత్యం, దురుద్దేశపూర్వకమైనదని ఖండించారు.ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి, ప్రజాప్రతినిధి గౌరవాన్ని దెబ్బతీయడానికి ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని నమ్మి భాను అన్నారు. కేశినేని శివనాథ్ ఎప్పటిలాగే ప్రజాసేవకు కట్టుబడి ఉన్న నాయకుడు. ఆయనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి.ఆయన పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తూ.గత పార్లమెంటు సభ్యులు అందరికన్నా భిన్నంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రతి కార్యకర్తను పేరుతో పిలవగల వ్యక్తి చిన్ని ఒక్కరే అన్నారు.వైసీపీ పార్టీ ఎన్నికల పోటీకి విజయవాడ పార్లమెంటు అభ్యర్థిని అప్పుడుకప్పుడు రెడీమేడ్ గా తెచ్చుకోవడం తప్ప వేరే గతి లేదని విమర్శించారు.విజయవాడ పార్లమెంట్ స్థానంలో తన ఉనికిని కాపాడుకోవడానికి మునుపెన్నడు లేని విధంగా ప్రత్యర్థ పై 2,82,085 అఖండ మెజారిటీతో గెలిచిన చిన్ని ని మీ రోత రాతలతో ఆయన ప్రతిష్టకు భంగం కలిగించాలనుకుంటే ఆకాశం మీద ఉమ్మేస్తే అది మీ ముఖాన్ని పడతది అన్న విషయాన్ని గుర్తించి ఇలాంటి తప్పుడు ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని, అన్నారు.

## చలివేంద్రాలు ప్రారంభించిన పశ్చిమ తహసీల్దార్ డి రిబ్కా రాణి





**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ మండలంలో పలు ప్రాంతాల్లో తహసీల్దార్ శ్రీమతి డి. రిబ్కా రాణి చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు తాగునీరు మరియు మజ్జిగ పంపిణీ చేశారు. అదేవిధంగా జంతువుల కోసం నీటి తొట్టి ఏర్పాటు చేయించగా, పక్షుల కోసం చిన్న గిన్నెల్లో నీరు ఉంచే కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎక్కువగా నీరు తాగాలని మరియు అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, విజయలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరీష్, వీఆర్ఓలు మల్లికార్జున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన తహసీల్దార్ శాంతి లక్ష్మి

**పెనుగంచిప్రోలు, మార్చి 26( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లోని పెట్రోల్ బంకులను మండల తహసీల్దార్ శాంతి లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇందనం నాణ్యత,సాంద్రత(డెన్సిటి ) తుకాలను ఆమె పరిశీలించారు. కొలతల్లో తేడాలున్నా, కల్తీ జరిగినా చర్యలు తీసుకుంటామని నిర్వహకులను హెచ్చరించారు.వినియోగ దారులు పెట్రోల్ పై వస్తున్నా వాదంతులు నమ్మవద్దు అన్నారు.మండలంలో అన్ని బంకులల్లో పెట్రోల్ నిల్వలు వున్నాయని తహసీల్దార్ స్పష్టం చేశారు.



# పేదలకు కొండంత అండ సి.ఏం ఆర్.ఎఫ్.

● లబ్ధిదారులకు 'సీఎంఆర్ఎఫ్' చెక్కుల పంపిణీ! ● మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రూ. 2.03 లక్షల ఆర్థిక సాయం మంజూరు. ● కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి చేతుల మీదుగా ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు అందచేత



**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, మార్చి 26, (వార్తాప్రభ) :** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అభయహస్తం అందించింది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి చొరవతో, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంజూరైన చెక్కులను బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

**లబ్ధిదారుల వివరాలు:** శస్త్రచికిత్సల నిమిత్తం మంజూరైన ఆర్థిక సహాయం వివరాలు ఇలా ఉన్నాయి:
లిమేఘన డప్పు (దూలపల్లి) : రూ. 30,000/-వీరమళ్ళ శ్రీ రాములు (జీడిమెట్ల) : రూ. 60,000/-
సావిత్రి మానెనూర్ (కుత్బుల్లాపూర్) : రూ. 41,000/-ఆర్. సతీష్ (బహదూర్ పల్లి) : రూ. 55,000/-తుడుము రాజ్ కుమార్ (దూలపల్లి) : రూ. 17,500/-

**ప్రజా సంక్షేమమే పరమావధి** ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యం పాలై ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడే పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం లాంటిదన్నారు. బాధితులు తనను సంప్రదించిన వెంటనే స్పందించి, ప్రభుత్వ సహకారంతో ఈ నిధులను మంజూరు చేయించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యము పై ప్రజలలో అవగాహన పెంచండి.

-సమీక్షా సమావేశంలో కమిషనర్ జి శ్రీజన ఆదేశం



**శేరిలింగంపల్లి,మార్చి 26 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి జోన్ మీటింగ్ హాల్‌లో గురువారం కమిషనర్ జి. శ్రీజన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇంటి ఇంటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు.ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్త సేకరణను కచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్లలో ప్రతి షాపు యజమాని తమ చెత్తను ఆటో డ్రైవర్లకు అప్పగించే విధానం పాటించాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెనాల్టీలు విధించాలని నిర్ణయించారు.పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశుద్ధ్య చర్యలే విజయానికి కీలకమని తెలిపారు.జోన్ పరిధిలో ఇంజనీరింగ్‌కు సంబంధించిన పలు సమస్యలపై కూడా చర్చించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను నిరంతరం పర్యవేక్షించి అమలు చేయాలని ఆదేశించారు.ఐటీ పరిశ్రమలకు శేరిలింగంపల్లి జోన్ కేంద్రంగా ఉన్నందున రహదారుల నిర్వహణ కూడా అదే స్థాయిలో ఉండాలని సూచించారు.స్వీపింగ్ అనంతరం వెంటనే చెత్త కుప్పలను తొలగించాలని,ఫ్లైఓవర్లపై మట్టి, ఇసుక వంటి వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించి లోటుపాట్లను సవరించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ ఐఏఎస్ (శేరిలింగంపల్లి),అపూర్వ చౌహాన్ ఐఏఎస్ (కూకట్పల్లి)తో పాటు అన్ని జోన్లకు చెందిన డిప్యూటీ కమిషనర్లు,డీఈలు, ఎస్‌డబ్ల్యూఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి-జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ మార్చ్ 26 (వార్తాప్రభ):** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్,బ్యాంకు పర్సన్ ఇన్చార్జ్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక సినిమారోడ్ లోని జిల్లా సహకార కేంద్ర ప్రధాన కార్యాలయంలో 98వ మహాజన సభ కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకు ఆర్థిక స్థితిగతులు, బడ్జెట్ అంచనాలు,ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందాలపై సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,బ్యాంకు నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.ముఖ్యంగా బ్యాంకు వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.బ్యాంకు ఖర్చులను తగ్గించి,లాభాల బాటలో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను దిశానిర్దేశం చేశారు.ఉమ్మడి జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో డీసీసీబీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.?ఈ సమీక్షా సమావేశంలో సీఈఓ రవి కుమార్,జిఎం సూర్య ప్రకాష్ , డిఆర్ ఓఎస్డి సింహచలం,సీనియర్ అధికారులు,పిఏసిఎస్ పిఐసి చైర్మన్లు,నాబార్డ్,బ్యాంకు అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# గర్జించిన ఆర్టిజన్ కార్మికులు!!

● విద్యార్హత బట్టి కన్వర్షన్ ఇవ్వాలి ● ఏపీఎస్సీబి సర్వీస్ రూల్స్ అమలు చేయాల్సిందే ● పదోన్నతులే లక్ష్యం.. ప్రభుత్వం దిగి రాకుంటే పోరాటం తప్పదు ● డివిజన్ వ్యాప్తంగా నిలిచిపోయిన పనులు ● ఏప్రిల్ 8 నుండి రాష్ట్రవ్యాప్త సమ్మె ● సీనియర్ నాయకులు వడ్డేపల్లి సురేష్






**పెద్దపల్లి/ రామగుండం: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా వారి విద్యార్హతను బట్టి కన్వర్షన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు సీనియర్ నాయకులు వడ్డేపల్లి సురేష్. ఈ మేరకు గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిసాన్స్ కన్సాలిడేటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రామగుండం డివిజన్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్ల నుండి ఆర్టిజన్ కార్మికులు స్వచ్ఛందంగా, భారీ సంఖ్యలో తరలివచ్చి తమ నిరసనను వ్యక్తం చేయడంతో కార్యాలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా నాయకులు సురేష్ మాట్లాడుతూ......ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒకే రకమైన నిబంధనలు ఉండాలని, తక్షణమే ఏపీఎస్సీబీ సర్వీస్ రూల్స్‌ను ఆర్టిజన్లకు కూడా వర్తింపజేయాలని ఈ సందర్భంగా గట్టిగా డిమాండ్ చేశారు. అర్హత ఉన్నప్పటికీ పదోన్నతులు లేక, సరైన గుర్తింపు లేక కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇకనైనా మొండివైఖరి వీడి తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఏప్రిల్ 8వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, మల్లారపు ప్రభాకర్, జి.కిరణ్, బోరే శ్రీనివాస్, ఎస్. రవి, సందీప్, శరత్, సుధాకర్, జనార్ధన్, రవికుమార్, తేజ, వేణు, ప్రణయ్, వందలాది మంది కార్మికులు పాల్గొని నిరసనను విజయవంతం చేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, తమ హక్కులు సాధించే వరకు పోరాటం ఆపబోమని నినదిస్తూ ఈ కార్యక్రమాన్ని ముగించారు.

# పేద బాలికలకు చికెన్‌పాక్స్ వ్యాక్సినేషన్ డ్రైవ్



**హైదరాబాద్ : మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**సమానమైన ఆరోగ్య సదుపాయాల ఆవశ్యకతను బలోపేతం చేస్తూ హైదరాబాద్ అన్స్ హాస్పిటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ స్మృతి రెడ్డి అట్టడుగు వర్గాల బాలికలకు చికెన్‌పాక్స్ టీకాలు అందించే ప్రత్యేక కార్యక్రమానికి మద్దతు అందించారు. ఈ కార్యక్రమం నోవో మెడి సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ గౌరి జిఎయుఆర్ఐ (జెనరేటింగ్ అవేర్నెస్ ఆన్ అండర్ ప్రివిలేజ్డ్ గర్ల్స్ రైట్ టు ఇమ్యునైజేషన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనికి క్రై - సి.ఆర్.వై. (చైల్డ్ రైట్స్ అండ్ యూ) మద్దతు లభించింది. ఈ ప్రచారంలో భాగంగా, కేవలం ఒక మిస్డ్ కాల్ ద్వారా పౌరులు తమ మద్దతును తెలియజేయాలని ప్రోత్సహించారు. ఇది నిరుపేద బాలికల నివారణ ఆరోగ్య సంరక్షణ కోసం ఒక పెద్ద ఉద్యమంగా మారింది. భారతదేశం టీకాల పంపిణీలో ఎంతో పురోగతి సాధించినప్పటికీ, లభ్యతలో ఇంకా లోపాలు ఉన్నాయి. చికెన్‌పాక్స్ వంటి కీలకమైన టీకాలు ప్రస్తుతం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ లో చేర్చబడలేదు. దీనివల్ల ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు తగిన రక్షణ లభించడం లేదు. ఇది వివిధ ప్రాంతాలు, జనాభా వర్గాల మధ్య టీకా కవరేజీలో అసమానతలను సృష్టిస్తోంది.ఈ కార్యక్రమం గురించి డాక్టర్ స్మృతి రెడ్డి మాట్లాడుతూ "చికెన్‌పాక్స్ అనేది నివారించగల వ్యాధి, అయినప్పటికీ ముఖ్యంగా వెనుకబడిన వర్గాలలో టీకా పంపిణీలో లోపాలు కొనసాగుతున్నాయి. ప్రతి బాలికకు సకాలంలో టీకాలు అందించడం అనేది బలమైన మరియు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అత్యవసరం. గౌరి జిఎయుఆర్ఐ వంటి వేదికలు అవగాహన పెంచడంలో అత్యవసరమైన చోట టీకా సౌకర్యాలను మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. టీకా వేయించుకోవడం అనేది సమర్థవంతమైన రక్షణను అందించినప్పటికీ, ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాల్లో దీనికి పరిమిత ప్రాధాన్యత ఉండటం వల్ల అందరికీ అందుబాటులో ఉండటం లేదు. అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన బాల్యం మరియు మరింత దృఢమైన ప్రజారోగ్య వ్యవస్థలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు.

# కృత్రిమ మేధపై అంతర్జాతీయ సదస్సు





**హైదరాబాద్ :మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్‌లో పురోగతులపై అంతర్జాతీయ సదస్సు ను ఇక్ఫాయ్ టెక్, ఇఐఎఫ్ హెచ్ ఈ హైదరాబాద్ లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్చైన్ సంయుక్తంగా నిర్వహించగా రెండు రోజులపాటు జరిగిన కీలక చర్చలు, ప్రధాన ప్రసంగాలు పరిశోధనా సమర్పణలతో విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ రంగాలలో జ్ఞాన మార్పిడి ఆవిష్కరణలకు చురుకైన వేదికగా నిలిచింది.సదస్సు ప్రారంభోత్సవ సమావేశంతో ప్రారంభమై ఇఐఎఫ్ హెచ్ఈ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటి రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి, ఇక్ఫాయ్ టెక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎల్. నారాయణ ప్రభావవంతమైన ప్రసంగాలు చేశారు. వారు సంస్థ అకడమిక్ ప్రతిభ, పరిశోధన, అంతర్జాతీయ సహకారంపై తన కట్టుబాటును హైలైట్ చేశారు. ఈ సమావేశాన్ని సదస్సు కన్వీనర్ డాక్టర్ సందీప్ కుమార్ పాండా, జనరల్ చైర్ డాక్టర్ పవన్ కుమార్, సహ-చైర్స్ డాక్టర్ రోహిణి, డాక్టర్ ప్రదోష్ కుమార్ నిర్వహించారు. రెండు రోజులపాటు సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుండి వచ్చిన విశిష్ట వక్తల ప్రధాన ప్రసంగాలు జరిగాయి. జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ కెమ్నిట్జ్కు చెందిన డాక్టర్ అలాజేంద్రో మస్రూర్ ట్రైన్ సిస్టమ్ ఆటోమేషన్, వైఫై సెన్సింగ్ టెక్నాలజీలలో మెషీన్ లెర్నింగ్ అనువర్తనాలపై ప్రసంగిస్తూ, వాటి అవకాశాలు, స్కేలబిలిటీ, విశ్వసనీయత డేటా గోప్యత వంటి సవాళ్లను వివరించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీకి చెందిన ప్రొఫెసర్ సతీష్ కుమార్ "ఆండ్రాయిడ్ మాల్వేర్ గుర్తింపులో మెషీన్ లెర్నింగ్ వినియోగం" అనే అంశంపై ప్రసంగించి, సైబర్ సెక్యూరిటీ బలోపేతంలో ఏ ఐ పాత్రను వివరించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేఘాలయకు చెందిన ప్రొఫెసర్ దీప్తేందు సిన్హా రాయ్ "స్మార్ట్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్ కోసం కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్"పై అవగాహన ఇచ్చారు. సదస్సులో ప్రధాన ఆకర్షణగా "మానవ మేధస్సును పునర్నిర్వచించడం: ఏ ఐ భావోద్వేగ, జ్ఞాన వైవిధ్యం" అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. దీనిని ఇక్ఫాయ్ యూనివర్సిటీ, సిక్కిం ఛాన్సలర్ ప్రొఫెసర్ ఓ. ఆర్. ఎస్. రావు మోడరేట్ చేశారు. ఈ చర్చలో కెనడాకు చెందిన స్వర్ణమౌళి మజుందార్, ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ జి. నరహరి శాస్త్రి, విప్రో మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వేణుగోపాల్, సుప్రా సంస్థకు చెందిన జి. ప్రసన్న, రెడ్ బెలూన్ ఏరోస్పేస్కు చెందిన డాక్టర్ సి. వి. ఎస్. కిరణ్ పాల్గొన్నారు. ఈ చర్చలో ఏ ఐ వ్యవస్థల్లో భావోద్వేగ మేధస్సు, జ్ఞాన వైవిధ్యాన్ని సమన్వయం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఒడిశాలోని కే ఈ సీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుభేందు కె. యు. పాణి "వాస్తవ ప్రపంచ ప్రభావం కోసం మానవ కేంద్రిత ఏ ఐ వ్యవస్థలు" అనే అంశంపై ప్రసంగించారు. స్వర్ణమౌళి మజుందార్ "సురక్షిత నగరాలు, సమాజాల కోసం ఏ ఐ " అనే అంశంపై మాట్లాడుతూ పట్టణ భద్రత, ప్రజా సేవలు మరియు సమాజ స్థిరత్వం పెంపులో ఏ ఐ పాత్రను వివరించారు.ప్రధాన ప్రసంగాలతో పాటు, సదస్సులో రెండు రోజులపాటు సాంకేతిక పేపర్ ప్రెజెంటేషన్లు, సమాంతర సెషన్లు నిర్వహించబడ్డాయి. వీటిలో స్మార్ట్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ, ఆప్టిమైజేషన్ టెక్నిక్స్, వాస్తవ ప్రపంచ ఏ ఐ అనువర్తనాలపై పరిశోధనలు ప్రదర్శించబడ్డాయి. ఈ సెషన్లు అకడమిక్ చర్చలు, విశ్లేషణ సహకారానికి మంచి వేదికగా నిలిచాయి.

# కూకట్ పల్లి ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

-సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస బాబు



**కూకట్ పల్లి,మార్చ్ 26,(వార్త ప్రభ)** కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు శ్రీనివాస బాబు శ్రీరామనవమి శుభాకాంక్షలను తెలియజేశారు. గురువారం ఆయన మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలో నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలను భక్తులు శాంతి యుత వాతావరణం లో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు చెరువులను అభివృద్ధి చేసేందుకు హైడ్రాధికారులు శ్రీకారం చుట్టారన్నారు. కూకట్ పల్లిలోని చెరువులను సుందరీకరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బండి రమేష్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి అభివృద్ధిలో మరింత దూసుకుపోతుందనడంలో ఏలాంటి సందేహం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఘనంగా దుర్యోధన బాబు జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, మార్చ్26 (వార్తాప్రభ):**రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్యోధన బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి దుర్యోధన బాబు జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బాబుకు కేక్ తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు.గత ఐదు సంవత్సరాలుగా కాలనీలో కార్మికుడిగా పనిచేస్తూ అందరితో కలిసి మెలిసి సరదాగా ఉండే వ్యక్తిగా బాబు పేరు సంపాదించుకున్నాడని పురంధర్ రెడ్డి తెలిపారు. అతని జన్మదినాన్ని కాలనీవాసులందరూ కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.బాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, అష్ట ఐశ్వర్యాలు కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జి. ప్రసాద్,ఎస్.శ్రీధర్,సి.కె. రెడ్డి, సాయి నాగేశ్వరరావు, తాండవ కృష్ణ,కృష్ణవేణి తదితరులు పాల్గొని దుర్యోధన బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ డిఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఆర్టిసన్ కార్మికులు ధర్నా

**హుస్నాబాద్ మార్చి 26 (వార్తాప్రభ):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ విద్యుత్ డిఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఆర్టిసన్ కార్మికులు ధర్నా చేపట్టారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సుమారు 19,000 మంది ఆర్టిసన్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఏపిఎస్ఇబి సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం, సబ్ ఇంజనీర్లు మరియు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే అవకాశం కల్పించాలని కోరారు. అన్ మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలన్నారు. మిగిలిపోయిన కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వచ్చే నెల 8 వ తేదీ లోపు తమ డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 30 వేల మంది విద్యుత్ కార్మికులు మెరుపు సమ్మెలో పాల్గొంటారని హెచ్చరించారు.

# "పరిశోధనల అమలుతో రైతులకు మేలు"

జి శివనారాయణ, విస్తరణ సంచాలకులు, ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
బాపట్ల లో ఏరువాక కేంద్ర ఆధ్వర్యం లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం






**బాపట్ల, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి):** రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఏరువాక కేంద్రం, బాపట్ల ఆధ్వర్యంలో గురువారం నాడు బాపట్లలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి. శివ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ముందు మరియు కోత తర్వాత సరైన రైతు యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను రైతులు వినియోగించడం ద్వారా వ్యవసాయ రంగంలో దిగుబడులలో వ్యత్యాసం తగ్గించడం, ఖర్చులు తగ్గి ఆదాయాన్ని పెంచడం, విత్తనోత్పత్తి సాధ్యమవుతాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, గుంటూరు పరిశోధన సహ సంచాలకులు డా. ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు నూతన పరిశోధనలను తెలుసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశాన్నీ నిర్వహించిన ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె. అచ్యుతరాజు మాట్లాడుతూ రైతులకు పంట యాజమాన్యం పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సమావేశాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఏం విజయ నిర్మల, బాపట్ల జిల్లా ఏపి ఎం ఐ పి ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ రమణ, లీడ్ బ్యాంక్ మేనేజర్, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతు బోడవుల లక్ష్మీనారాయణ, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సంఘాల ప్రతినిధులు, రైతులు, పాల్గొని రైతు యాజమాన్య పద్ధతులు, విలువ వృద్ధి వంటి అంశాలపై అవగాహన పొందారు.

# జి.కొండూరు జెడ్పి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

- మధ్యాహ్న భోజనం నాణ్యత ను పరిశీలించిన ఎమ్మెల్యే
- విద్యార్థులతో కలసి నేలపై కూర్చుని భోజనం చేసిన ఎమ్మెల్యే
- మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? భోజనం బాగుంటుందా ..? అని విద్యార్థులను అడిగిన ఎమ్మెల్యే







**జి.కొండూరు,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు గురువారం ఉదయం సందర్శించా రు.పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంపై ఆరా తీశారు. స్కూల్ టీచర్లు, సిబ్బందితో కలిసి వంట గదిని, పాఠశాల పరిసరాల పరిశు భ్రతను తనిఖీచేశారు. క్రీడల సామాగ్రిని, ఆట వస్తువులను పరిశీలించా రు.మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. బియ్యం నిల్వలను, రికార్డులను పరిశీలించి, 15 కిలోల వ్యత్యాసం గుర్తించారు.ఇకపై అంతా సవ్యంగా ఉండాలన్నారు. బోర్డుపై వ్రాసి ఉన్న రోజువారీ భోజనం మెనూ పరిశీలించారు.ముందుగా విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూశారు.కూరలో ఉప్పు కాస్త ఎక్కువైందని గుర్తించి,భోజనం నాణ్యత విషయంలో జాగ్రత్తగా ఉండాలని వంట నిర్వాహకులకు సూచించారు.మెనూ ప్రకారం అన్నం పెడుతున్నారా? భోజనం బాగుంటుందా? అని విద్యార్థులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రశ్నించారు. ప్రతిరోజూ భోజనం బాగానే ఉంటుందని విద్యార్థులు తెలిపారు. వారానికి ఎన్నిసార్లు గుడ్డు పెడుతున్నారని ప్రశ్నించగా 5 సార్లు గుడ్డు పెడుతున్నారని విద్యార్థులు సమాధానం ఇచ్చారు.గత ప్రభుత్వం ఇచ్చిన బ్యాగులు, షూస్ ఇతరత్రా సామాగ్రి బాగున్నాయా..? కూటమి ప్రభుత్వం ఇచ్చిన బ్యాగులు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించడంలో అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు.భోజన శాల, క్రీడా మైదానం అభివృద్ధికి హామీ ఇచ్చారు.పాఠశాల ఆవరణతో పాటు అంతా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.మరో వారం రోజుల్లో పాఠశాలను తనిఖీ చేసి, పాఠశాల సమగ్రాభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తామన్నారు. పేదల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్ల కంటే ధీటుగా ఉండాలనే ప్రధాన ఆశయంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.ఆ దిశగా యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు మరింత బాధ్యతగా ఉంటూ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు.

**విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలి :** విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామన్నారు. టీవీలు, సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని విద్యార్థుల కు హితబోధ చేశారు.విద్యార్థులు సమయ స్ఫూర్తి, తెలివితేటలు, కార్యదీక్ష, పట్టుదల కలిగి ఉండాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను కష్టపడి చదువుకుని సాధించాలన్నారు. ప్రతిభ కల విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించ డానికి ప్రతి ఏడాది స్కాలర్షిప్లు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు.

# మార్కాపురం బస్సు ప్రమాదంపై మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా, రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్-ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని,ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఉద్యోగ పెన్షనర్లను నష్టపరిచిన కూటమి ప్రభుత్వం



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచిందని వైఎస్సార్సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం గుడివాడ నియోజకవర్గం అధ్యక్షుడు టి వి రమణ కుమార్ విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్న మధ్యంతర భృతి ప్రకటించలేదు పి అర్ సి కమిటీ ఇంతవరకు నియమించలేదు అంతేకాకుండా ఈ సంవత్సరం జనవరిలో 30 నెలల డిఆర్ బకాయిలు విడుదల చేశారు అందులో 30% మందికి ఇంతవరకు బకాయిలు, జమకాలేదు ఇంతవరకు దీనిపై సమాధానం లేదు అదేవిధంగా పదవి విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ నిలిపివేసిన సందర్భం చరిత్రలో లేదు అయితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూలై నుండి గ్రాట్యూటీ చెల్లించలేదు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక డి ఏ మాత్రం ఉద్యోగులు పొందటం జరిగింది ఇంకా నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నవి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐఆర్ ప్రకటించి పిఆర్సి కమిటీ ఆధ్వర్యంలో డి ఎ బకాయిలు రానివారికి వెంటనే చెల్లించాలి ఇంకా పెండింగ్లో ఉన్న డీఏలను వెంటనే రిలీజ్ చేయాలి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని, తిరుపతిలో విధి నిర్వహణలో ఉన్న వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ నాగార్జునపై దాడి అత్యంత ఘోరమైన చర్య అని.. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు జరగటం సహించరాని విషయం విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగపై దాడి చేయడం ప్రభుత్వ వ్యవస్థపై దాడిగా పరిగణించి దాడికి పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.


# కలిదిండి మానవతా వారిచే ఆర్థిక సాయం



**కలిదిండి,మార్చి 26 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని పడమటిపాలెం గ్రామం కు చెందిన కుప్పాల శివపార్వతి, మారుబోయిన వెంకట రావమ్మ లు అనారోగ్యంతో ఇటీవల మరణించియున్నారు. వీరి కుటుంబాలు ఆర్థికంగా వెనకబడి ఉండటం వలన కలిదిండి మానవతా శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు నూకల శ్యామల రావు గుప్తా మృతుల కుటుంబాలకి ఒక్కొక్కరి కుటుంబానికి రూ. 5000 చొప్పున ఇద్దరికీ ఇద్దరి కుటుంబ సభ్యులకు రు. 10,000/- ఆర్థిక సహాయము అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పేటేటి వివేకానంద గురుస్వామి, జిల్లా జాయింట్ సెక్రెటరీ గోదావరి సత్యనారాయణ, గౌరవ డైరెక్టర్ మారు బోయిన రత్నారావు, కో- కన్వీనర్ చిట్టూరి బాలకృష్ణ, కలిదిండి శాఖ కోశాధికారి ప్రత్తి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు కలిదిండి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రములో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయండి

## - రాష్ట్ర ప్రభుత్వంకు డా. పోతుల నాగరాజు డిమాండ్.



**అనంతపురం,మార్చి 26 (వార్తాప్రభ) :** మాకు వద్దు ఈ వయసు పెంపు అని ఉద్యోగులు మొర పెట్టుకొంటూ ఉన్న ముఖ్యమంత్రి, యువ నాయకులు నారా లోకేష్ పోటీ పడి ఉద్యోగుల పదవి విరమణ వయసు 58 సంవత్సరాలనుండి 60 కి. 60 నుంచి 62 కి పెంచుతూ పోతూ ఉంటే నిరుద్యోగ యువత ఏమైం పోవాలనీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నోటిఫికేషన్ లేక వయసు పైబడి నిరాశ నిస్పృహలతో జీవితం మీద విరక్తి చెందిన యువత ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని అరికట్టి చదువు కున్న నిరుద్యోగ యువత కు ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించి వారిని ఆదుకోవాలని పోతుల నాగరాజు రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో 3లక్షల 50 వేలకు పైబడి ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఆలా కాకుండా కేవలం మీ ప్రచారం కోసం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగ యువతకు కోచింగ్ సెంటర్ లకు అప్పు చేసి ఉద్యోగాల శిక్షణ కోసం కుటుంబాలను ఆర్థిక ఇబ్బంది లోకి నెట్టే ప్రకటన అన్నారు. మీకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అందించే తపన ఉంటే పదవి విరమణ వయసు 58 సంవత్సరాలకే పరిమితం చేయండి, ప్రతి సంవత్సరం ఖాళీ అయినా ఉద్యోగాలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే ప్రక్రియ శ్రీకారం చుట్టండి అని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం పాఠశాలలను కుదించే కుట్రలను ఆపండి, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారికీ ఇవ్వవలసిన బెనిఫిట్స్ వెంటనే ఇవ్వండి, ఉద్యోగుల కు పి.ఆర్.సి. నీ డి. ఏ. బకాయిలను వెంటనే చెల్లించి వారినీ ఆదుకోవాలని, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్య లను కూడా వెంటనే పరిష్కారం చేయాలనీ డా.పోతుల విజ్ఞప్తి చేశారు.

# మృతుని కుటుంబానికి ముదునూరి ఆర్థిక భరోసా

## -గొర్ల బాబ్జి కుటుంబాన్ని పరామర్శించిన మురళి రాజు



**ప్రత్తిపాడు,మార్చి 26 (వార్తాప్రభ) :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఇటీవల కాలంలో గుండె పోటుతో మరణించిన గొర్ల బాబి కుటుంబ సభ్యులు భార్య,ఇద్దరు పిల్లలను,వారి కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నాయకుడు,నరస్పాపురం పార్లమెంటు పరిశీలకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు పరామర్శించి బాబ్జి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆ నిరుపేద కుటుంబానికి రూ.5000 లు ఆర్థిక సాయం అందజేసి బాబ్జి ఇద్దరు పిల్లలకి భవిష్యత్తు కాలంలో ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,14 వార్డు నెంబర్ గదులు శివ,నానిపల్లి వెంకన్న ,నానిపల్లి నాని ,గొర్ల శ్రీను,గొర్ల సుబ్బారావు ,గొర్ల సత్తిబాబు (నానాజీ) వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ మానవతా వారిచే అన్నదాన కార్యక్రమం



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** గురువారం మధ్యాహ్నం కె.టి.ఆర్ కాలేజీ రోడ్డులో కల శిరీషా ఫౌండేషన్ వికలాంగుల పాఠశాల లో మన మానవతా అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, ఉమ్మడి క్రృష్ణాజిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు స్వర్గీయ మురళీకృష్ణ 7వ వర్ధంతి సందర్భంగా దండమూడి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత పలువురు వక్తలు మాట్లాడుతూ స్వర్గీయ మురళీకృష్ణ గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దండమూడి దంపతులు, ఉమ్మడి క్రృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, ఉమ్మడి క్రృష్ణాజిల్లా కోశాధికారి అన్నపురెడ్డి గోపీరెడ్డి, ఉమ్మడి క్రృష్ణాజిల్లా విద్యానిధి డైరెక్టర్ మరియు గుడివాడ మానవతాశాఖ కన్వీనర్ ఉప్పలపాటి మారుతీప్రసాద్, గుడివాడ మానవతాశాఖ కార్యదర్శి నందమూరి పద్మజ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, కార్యవర్గ సభ్యులు సామి రామమోహనరావు, ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, సభ్యులు కోటేశ్వరరావు, అర్జునరావు, సూరిబాబు, చింతలూరి సత్యనారాయణ, దుడ్డు వెంకటేశ్వరరావు, గుళ్ళపల్లి శైలజ, వీరమాచనేని శైలజ లు పాల్గొని దండమూడి దంపతులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

# రామాలయానికి విగ్రహాలు అందజేసిన కలపాల శ్రీధర్(రాజబాబు)



**హనుమాన్ జంక్షన్,మార్చి 26 (వార్తాప్రభ) :** శ్రీరామనవమి సందర్భంగా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామపంచాయతీ పరిధి నారాయణపురంలో ఉన్న రామాలయానికి గ్రామ ప్రముఖులు కలపాల శ్రీధర్ తన స్వంత నిధులలో సీతారాములు, లక్ష్మణుడు అంజనేయస్వామి వారి నూతన విగ్రహాలను బహుకరించారు. రామాలయంలో విగ్రహాలు పాడైపోవడంతో ఈ విషయం తెలుసుకున్న కలపాల శ్రీధర్ శ్రీరాముడు పై ఉన్న అంచెంచలమైన భక్తి విశ్వాసంతో నూతన విగ్రహాలను రామలయానికి ఇవ్వాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. దింతో పాటు నేడు సీతారాముల కల్యాణాన్ని కూడా స్వంత ఖర్చులతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీధర్ తెలిపారు. రామ నామం మధురం రామనామం పవిత్రం లోకాభిరాముడైన శ్రీరాముడు అశీస్సులు అందరిపై సకలు శుభాలు కలగాలనే మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికి శ్రీరామనవమి శుభాకాంక్షలను కలపాల శ్రీధర్ తెలియజేసారు. నూతన విగ్రహాలను నారాయణపురం రామాలయం ట్రస్టీ బోగ్గవరపు శ్రీనివాసరావు, బోగ్గవరపు సామేలు, బుక్యా స్వామి కు నూతన విగ్రహాలను కలపాల శ్రీధర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి పి ఏ సి ఎస్ చైర్మన్ కలపాల నాని, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, బుగ్గా శివ, పంచాయతీ ఈవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ బాడీ సమావేశం





**గన్నవరం,మార్చి 26 (వార్తాప్రభ) :** శ్రీ గాంధీ మహర్షి వ్యవసాయ సహకార పరపతి సంఘం కేసరపల్లి జనరల్ బాడీ సమావేశం బ్యాంకు పర్సన్ ఇంచార్జీ నాగభూషణం అధ్యక్షతన కేసరపల్లి గ్రామంలో కో ఆపరేటివ్ బ్యాంకు ప్రాంగణంలో నిర్వహించినారు. ఈ సమావేశంలో గన్నవరం కేడిసిసి బ్యాంకు చీఫ్ మేనేజర్ రాంబాబు, బ్యాంకు మాజీ డైరెక్టర్ మూల్పూరు మాధవన్ , పల్లి ధర్మనందన, కేసరపల్లి టీడీపీ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్, టీడీపీ నాయకులు అన్నే హరికృష్ణ, అంజి బాబు, కేసరపల్లి నీటి సంఘం సభ్యులు, మహిళా రైతు కొక్కిరపాటి నాగమణి, రైతులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీరామనవమి వేడుకలకు అందంగా ముస్తాబైన పలు దేవాలయాలు





**పెనుగంచిప్రోలు,మార్చి 26 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని చెరువు కట్ట బజార్, రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న రామ మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 42 నిమిషాలకు పురోహితుల మంత్రోచ్ఛరణం మజ్జ స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు..

# సీతారామ కళ్యాణానికి చలువ పందిళ్ళు సిద్ధం..



**అవనిగడ్డ,మార్చి 26 (వార్తాప్రభ) :** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించేందుకు చలువ పందిళ్ళు సిద్ధం అయ్యాయి.శుక్రవారం జగత్కళ్యాణ కారకుడు శ్రీరామ చంద్ర మూర్తి సీతమ్మ అమ్మవారి కళ్యాణానికి నియోజకవం-ర్గంలో వాడవాడలా భక్తులు చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి సుందరంగా అలంకరించారు.కళ్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.చలువ పందిళ్ళ పరిసరాలు భక్తిగీతాలతో పూర్తి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# వేలేరు గ్రామానికి వన్నె తెచ్చిన కొడాలి దీపా దైవకృప

- మహిళల పై గృహ హింస చట్టాలు పై పరిశోధనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్



**హనుమాన్ జంక్షన్,మార్చి 26 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వేలేరు గ్రామం లో పుట్టి పెరిగి 2010 లో జూనియర్ సివిల్ జడ్జ్ గా ఉద్యోగం పొంది ప్రమోషన్ పై ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జ్- అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ గా కాకినాడ జిల్లా పెద్దాపురం లో విధులు నిర్వహిస్తున్న వేలేరు ముద్దుబిడ్డ కొడాలి దీప దైవకృప మహిళల పై గృహ హింస -సంబంధిత చట్టాలు-పరిపాలన - న్యాయ స్థానాల దృక్కోణం అనే అంశం పై జరిపిన పరిశోధన కు విశాఖపట్టణం లోని ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను బుదవారం జరిగిన 92వ స్నాతకోత్సవంలో ప్రదానం చేశారు. తన కుమార్తె డాక్టరేట్ పొందడం పట్ల ఆమె తల్లితండ్రులు కొడాలి సత్య ప్రభాకర్,కొడాలి విజయకుమారి, కుటుంబసభ్యులు,వేలేరు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# ఆర్.వై.ఎస్.ఎఫ్. జిల్లా అధ్యక్షునీగా పటమట నరేష్



**గన్నవరం,మార్చి 26 (వార్తాప్రభ) :** ఆర్.వై.ఎస్.ఎఫ్. కృష్ణా జిల్లా అధ్యక్షులుగా పటమట నరేష్ నియమితులయ్యారు. గురువారం మచిలీపట్నం లో జరిగిన ఆర్.వై.ఎస్.ఎఫ్. జిల్లా సమావేశంలో వీరికి రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పటమట నరేష్,మాట్లాడుతూ మా మీద నమ్మకంతో అవకాశం కల్పించిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో విద్యార్థి, యువజన సమస్యలపై పనిచేస్తామనీ మండల స్థాయినుండి కమిటీలు ఏర్పాటు చేసి ఆర్.వై.ఎస్.ఎఫ్. నీ బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు.రాష్ట్రంలో 2లక్షల యాభై వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించడం సరికాదని లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం, పద్దారాయుడుతోట
### టెండరు ప్రకటన

**ఆర్.ఓ.సి.నెం.నిల్/2026** **తేది. 23-03-2026**

కృష్ణాజిల్లా, మొవ్వ మండలం, పద్దారాయుడుతోట గ్రామ పంచాయితీ నందు 2026-27 సం.కి గాను కాంట్రాక్టు పద్ధతిపై కాంట్రాక్టు లేబర్లుగా పనిచేయుటకు తేది. 28-03-2026 న మధ్యాహ్నం గం.2.00 నుండి గం.2.30 వరకు పంచాయితీ కార్యాలయము వద్ద పంచాయితీ కార్యదర్శి గారిచే, వారి చేత గానీ ఈ దిగువ తెలిపిన పనులకు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు అప్పటికి హాజరు అయిన టెండరుదారుల సమక్షంలో మధ్యాహ్నం గం.03.00ని.లోపు సదరు టెండర్లను తెరవబడును. సదరు టెండర్ల ప్రక్రియ నందు ఇతర వివరములు కోరు వారు గ్రామ పంచాయితీ కార్యాలయ పనివేళల్లో సంప్రదించవలసినదిగా కోరడమైనది.

| వ.నెం | వివరములు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | స్వీపర్ కం నిచ్చెన మోయుట మరియు చేయదగిన ఇతర పనులకు-1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |
| 2) | ఎలక్ట్రీషియన్ గా కం ట్యాంక్ వాచర్ - 1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |

నోట్ :- 1. సదరు పనుల నిర్వహణకు పూర్వ అనుభవం ఉన్న వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
2. పంచాయితీ నిధుల సౌలభ్యాన్ని బట్టి చెల్లింపులు చేయబడును.
2. సదరు టెండర్లు, ఇతర విషయములలో పంచాయితీ కార్యదర్శి మరియు గ్రామ పంచాయితీ వార్లదే తుది నిర్ణయము.

**సం/- శ్రీమతి తాతా స్వప్న**
**సర్పంచ్**
**గ్రామ పంచాయితీ - పద్దారాయుడుతోట**

**సం/- శ్రీ పుట్టి నాగ శ్రీనివాసరావు**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయితీ - పద్దారాయుడుతోట**

## బంటుమిల్లిలో ప్రజా దర్బార్.. పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్..



**కృత్తివెన్ను,మార్చి 26 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించిన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ . ప్రజల నుంచి పలు సమస్యల పై అర్జీలను స్వీకరించి ముఖ్యంగా గ్రామాల్లో వీధిలైట్లు, నీటి సమస్య, రోడ్ల ఏర్పాటు, భూ ఆక్రమణలు రెవెన్యూ విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై పలువురు అర్జీల రూపంలో వినతి చేశారు. ప్రజా దర్బారులో ప్రజలు ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదు పత్రాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించి పరిష్కరించ గల అర్జీల పై నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధ వహించాలని సంబంధించిన శాఖ అధికారులకు సూచించడం జరిగింది. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను బాధ్యతతో స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాము. రైతుల భూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండ రైతులకు ఇబ్బందులు లేకుండా వి.ఆర్.ఏ. వీఆర్వో స్థాయి నుంచి తహసిల్దార్ వరకు అందరూ వేగవంతంగా పరిష్కరించే జవాబుదారితనంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్య విలువలు అవసరం....
-గూడూరు తహసీల్దార్ రాజ్యలక్ష్మి



**పెడన,మార్చి 26 (వార్తాప్రభ) :** విద్యార్థులు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్య విలువలను అలవర్చుకోవాలని గూడూరు తాసిల్దార్ రాజలక్ష్మి అన్నారు. నందమూరు గ్రామంలోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నాడు రాయల్ అసోసియేషన్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్(( రేస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కనబరిచిన ప్రతిభ పట్ల తాసిల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ తో నిర్మాణాలు జరుగుతున్నాయాన్నారు. ఆ మెటీరియల్తో కళాశాలలో నిర్మించిన జియో స్ట్రెచర్ గురించి చెప్పారు. ఇందులో భాగమైన విద్యార్థులు అధ్యాపకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలోసివిల్ విభాగధిపతి గిరి ఫణి కుమార్ కళాశాల ప్రిన్సిపాల్ బి ఆర్ ఎస్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల రివ్యూ నిర్వహించిన డిజిపిఓ లావణ్య



**విస్సన్నపేట,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టాక్స్ కలెక్షన్స్ పై డిజిపిఓ లావణ్య రివ్యూ నిర్వహించారు. మార్చి 30వ తేదీ నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్ రామమోహన్ ఈవో హరికృష్ణ కుమార్ పలు గ్రామాల సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వీలునామా దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, పిఠాపురం, రథాల పేట, హౌస్ నెంబర్ 11-3-65 కాపురస్తులు కీర్తిశేషులు ఏ అప్పన్న గారి కుమారుడైన ఏ.బి. అప్పారావు అను నాకు నా తల్లి గారు శ్రీమతి ఏ.నుకాలమ్మ గారు 16.03.2020 న పైన ఉదాహరించిన ఇంటి నెంబర్ కు సంబంధించి వ్రాసిన వీలునామా దస్తావేజులు కలిగిన కవర్ 21-03-2026 న కాకినాడ నుంచి పిఠాపురం కు బస్సులో వెళ్ళుతుండగా జారీ పడిపోయినవి. వెంటనే పరిసర ప్రాంతాలలో వెతికిన కనిపించలేదు. సదరు వీలునామా పత్రాలు ఎవరైనా ఉపయోగించిన, ఎవరైనా ఇటువంటి అన్యక్రాంతములు జరిపిన చట్ట ప్రకారం తీసుకునే యావత్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేస్తూ... ఎవరికైనా మా తల్లిగారు శ్రీమతి ఏ.నూకాలమ్మ గారు వ్రాసిన వీలునామా పత్రాలు దొరికిన యెడల నాకు తెలియపరిచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**సెల్ : 6305472567**

## రైతు బజారు ను పరిరక్షించాలి



**కాకినాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** కాకినాడ బస్టాండ్ వద్ద గల రైతు బజార్లో గురువారం ఏఐకేఎంఎస్, ఐఎఫ్టియు సంఘాల నాయకత్వంలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం రైతులు ప్రదర్శనగా కలెక్టరేట్కి వెళ్లి తమ డిమాండ్ల పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్కు, అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులను, ప్రజలను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జనిపల్లి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి పి వెంకట్ నాయుడు, ఐఎఫ్టియు నాయకులు జె వెంకటేశ్వర్లు, జి ఆదినారాయణ, ఆర్ రఘువులు, ఎం ఏసు, జి బాలరాజు, రైతు నాయకులు కనకారావు, వీర్రాజు మాట్లాడారు. వెంకట్ నాయుడు మాట్లాడుతూ రైతు బజార్ను 1999లో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని, ఇది ప్రజలకు సరసమైన ధరలకు నిత్యవసర వస్తువులు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, వంట నూనెలు 10 తరాలు అందుబాటులో ఉన్నాయని, 200 మంది రైతులు ఈ రైతుబజారుపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, ఇట్లాంటి రైతు బజార్ను ఆక్రమించడానికి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 93 కులాల బీసీ ఐక్య వేదిక నాయకులు అని చెప్పుకుంటున్న మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని, రైతు బజార్ స్థలాన్ని రైతు బజారుకు ఆనుకొని ఉన్న భాస్కర్ గణేష్ మరి కొంతమంది ఆక్రమించారని, ఆక్రమణలు తొలగించి రైతులకు మరింత సౌకర్యవంతంగా రైతు బజార్లు తీర్చిదిద్దాలని కోరారు. రైతులపై బెదిరింపులకు, అదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న భాస్కర్ గణేష్ను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు నిర్మాణ నాణ్యత తనిఖీ..




**అవనిగడ్డ,మార్చి 26 (వార్తాప్రభ) :** లక్షలాది రూపాయల ప్రజాధనంతో మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో నిర్మితమవుతున్న రహదార్ల పనులు నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ తనిఖీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ అసిస్టెంట్ ఇంజినీర్ బాషా గురువారం తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణంలో వినియోగించిన మెటీరియల్ నిబంధనలకు అనుగుణంగా ఉందని నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డీఈ పగడాల సురేష్ బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పెండింగ్ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయండి
-జిల్లా కలెక్టర్ కు ఏపీడబ్ల్యు జేఎఫ్ వినతి



**తిరుపతి,మార్చి 26 (వార్తాప్రభ) :** తిరుపతి జిల్లాలో మొదటి జాబితాలో మంజూరు అయ్యి పెండింగ్ లో ఉన్న అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను ఏపీ డబ్ల్యు జేఎఫ్ నాయకులు గురువారం సాయంత్రం కోరారు. కలెక్టర్ ను కలిసిన ఫెడరేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు జి.చెంగల్రాయులు(గాంధీ), వళిగళం గోపీ,జిల్లా ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు,సీనియర్ జర్నలిస్ట్ ఆలూరు గిరిధర్,కోశాధికారి శ్రీనివాస్, తిరుపతి నిమోజకవర్గం అధ్యక్ష,కార్యదర్శులు బాలసుబ్రమణ్యం,కుమార్, కోశాధికారి మణి తదితరులు కలిశారు .మొదటి జాబితా లో పెండింగ్ అక్రిడిడేషన్ కార్డులతో పాటు రెండో జాబితా సమావేశం కూడా త్వరగా నిర్వహించాలని కోరారు.ఈ సందర్భంగా కలెక్టరు ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహిస్తామని, అర్హులైన వారందరికీ అక్రిడిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన జిల్లా కమిటీకి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఘణంగా సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నూతన కమిటీ కి శుభాకాంక్షలు తెలిపారు.

# వెలగలేరులో పోలవరం రైట్ కెనాల్ పై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

● ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని కలసి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు





**విజయవాడ (జి.కొండూరు),మార్చి 26 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండలంలోని వెలగలేరులో పోలవరం రైట్ కెనాల్ పై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని గురువారం కలసి విజ్ఞప్తి చేశారు.వంతెన లేకపోవడంతో వెలగలేరు గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.జి.కొండూరు మండలంలో పులివాగు, బుడమేరు, పోలవరం కుడి ప్రధాన కాలువ ఒకేచోట కలిసే ప్రాంతంలో రైతులు అవతల ఒడ్డుకు దాటేందుకు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి రామానాయుడు కి వివరించారు.2010-11 మధ్య కాలంలో, ఆపై దాదాపు 10 మంది వరకు ఇక్కడ నీటిలో మునిగి మృత్యువాత పడ్డారన్నారు.ముఖ్యంగా నర్సాయగూడెం చెరువు కింద వ్యవసాయ భూములు సాగు చేస్తున్న మాగాణి రైతులు వర్షాకాల సమయంలో వెలగలేరు నుంచి ఈ సంగమ ప్రాంతాన్ని దాటే సాహసం చేయలేక దాదాపు 32 కిలోమీటర్లు పైగా రానూ పోనూ ప్రయాణిస్తున్నారని అన్నారు. కొత్తకవులూరు మీదుగా నర్సాయిగూడెం చెరువుకు వెళ్లి వస్తూ ఎన్నో వ్యయప్రయాసలు పడుతున్నారని అన్నారు.ఇక్కడ వంతెన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి తగు చర్యలు చేపడతా మని హామీ ఇచ్చారు.

**కోతులవాగు వద్ద బెడ్ డ్యామ్ స్థానంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయండి :** చిన నందిగామలో కోతులవాగు వద్ద బెడ్ డ్యామ్ శిథిలావస్థకు చేరి గత ఏడాది వరదలకు కొట్టుకుపోయిందన్నారు. బెడ్ డ్యామ్ నూతనం గా నిర్మించే కంటే ఇక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే సుమారు 1000 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు తొలిగిపోతా యని మంత్రికి . దీనికి కూడా నిధులివ్వాలని కోరగా ఎమ్మెల్యే వసంత మంత్రి రామానాయుడు కి వివరించారు.వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు.

## జర్నలిస్టుల వైద్య శిబిరాలు మంచి స్పందన..

● జర్నలిస్టుల వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయం ● డిఎంఅండ్ హెచ్ఓ నరసింహా నాయక్



**కాకినాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జె నరసింహనాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాఘవ 24 అవర్స్ ఎమర్జెన్సీ హాస్పిటల్లో వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాఘవ 24 అవర్స్ ఎమర్జెన్సీ హాస్పిటల్ సహకారంతో జర్నలిస్టులకు వైద్య శిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరానికి సుమారు 225 మందికి పైగా జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, ఆర్థోపెడిక్, దంత వైద్యం, ఈసీజీ, 2డి ఎకో, గైనకాలజీ, మానసిక వైద్యం ఆర్ఎఫ్టి, ఎల్ ఎఫ్ టి, తదితర 60 రకాల పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, నేత్ర వైద్యులు, ఆర్థోపెడిక్, తదితర వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన వైద్యులను, వైద్య సిబ్బందిని, పాత్రికేయులను, రాఘవ 24 అవర్స్ హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాజాభివృద్ధిలో భాగస్వాములైన పాత్రికేయులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇటువంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాఘవ 24 అవర్స్ ఎమర్జెన్సీ హాస్పిటల్ చైర్మన్ ఎన్ నగేష్ బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల వైద్య శిబిరం నిర్వహించడంలో తమను భాగస్వాములను చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు ఆరోగ్య సమస్యల పరిష్కారానికి మెరుగైన వైద్యం అందించేందుకు తమకు ఆసుపత్రిలో డబ్ల్యూజెహెచ్ఎస్ ఇన్సూరెన్స్ సదుపాయం ఉందని ఈ సదుపాయాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీఎస్ రామచంద్రరావు, ఏఈఐఈ సీ బాబురావు, డివిజనల్ పీఆర్ఓ పిరవి, అడిషనల్ డీఎంహెచ్ఓ ఎస్ చలమయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ సావిత్రి, డీఐవో సుబ్బరాజు, పీఓఆర్బీఎస్కె అరుణ, రామారావు పేట, ప్రతాప్ నగర్ యుపీహెచ్సీ వైద్యాధికారులు డా జ్యోత్స్న, ఆజీజ్; రాఘవ ఆసుపత్రి నుంచి ఎన్ రాఘవ చౌదరి, టీ కావ్య, రామ్ ప్రసాద్, ఎన్ ఝాన్సీ, వీ లోకేష్ ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులపై అవగాహన పెంచుకోవాలి
-విదిశా కళాశాల చైర్మన్ కె.వెంకటేష్



**కాకినాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** జిల్లా విపత్తు నిర్వహణ సంస్థల వారి ఆధ్వర్యంలో కాకినాడలో గల విదిశా జూనియర్ కళాశాలలో విద్యార్థినీ,విద్యార్థులకు విపత్తుల పట్ల అవగాహన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రమాద సమయాలలో, విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు పాటించవలసిన మెలకువలు వారు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తూ మరొకరికి ఏవిధంగా మనం సహాయపడాలి, ప్రమాదాల బారి నుండి మనం ఎలా తప్పించుకోవాలో అనే అంశంలు విద్యార్థులందరికీ తెలియజేసారు.వారికి గల సందేహాలను నివృత్తి చేసి సమాజం పట్ల మనకు ఉన్న సేవా భావాన్ని, కర్తవ్యం నిర్వహణను తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు ప్రకృతి విపత్తుల పట్ల,విపత్తులపై కూడా అవగాహన కల్పించుకున్నట్లయితే విపత్తులను ధైర్యంగా ఎదుర్కొనని,ముఖ్యంగా ప్రతి విద్యార్థి ఈ విపత్తుల పట్ల అవగాహన ఏర్పరచుకుంటే వారు కూడా వారి ఇళ్లల్లో పాటు,చుట్టుపక్క ప్రదేశాలలో కూడా విపత్తుల సంభవించినప్పుడు,ధైర్యంగా మనం ఎదుర్కొనవచ్చు నన్నారు. అంతేకాకుండా ఏవైనా పెద్ద పెద్ద భవనాలలో అగ్ని ప్రమాదానికి గురైనప్పుడు వాటి నుండి మనం ఏవిధంగా బయటపడాలో తెలియపరుస్తూ ప్రతి ఒక్కరిని కూడా ఆలోచింప చేసే విధంగా విపత్తుల పట్ల మనకు ఉండే సామాజిక బాధ్యతలను గుర్తించు కోవాలని తద్వారా మనం సమాజంలో సేవ చేయడానికి ఒక మంచి అవకాశంగా మనం ఉపయోగపడుతుందన్నారు. విదిశా జూనియర్ కళాశాల చైర్మన్ కే.వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విపత్తుల పైన అవగాహన ఏర్పరచుకుంటే అది భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అగ్నిమాపక శాఖ ముఖ్య అధికారి సుబ్బారావు ,విదిశా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.జయరాం, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఎలమంద, మేనేజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిని కలిసిన మండల టిడిపి పెద్దలు



**విస్సన్నపేట,మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలానికి చెందిన ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావులు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామ సుబ్బారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పట్టు వస్త్రాలతో ఘన సన్మానం నిర్వహించారు.

## శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...

● శ్రీ కోదండ రామస్వామి వారికి పుట్టు వస్త్రాలు
**సమర్పించిన నర్రా విజయభాస్కరరావు దంపతులు**



**హనుమాన్ జంక్షన్, మార్చి 26 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాములు కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య తెలియజేశారు.. ఈ సందర్భంగా పరుచూరి సుకన్య మాట్లాడుతూ ఉదయం నాలుగు గంటలకు గణపతి పూజ, నాలుగు గంటల 30 నిమిషాలకు స్వామివారికి పంచామృత అభిషేకం, 6 గంటలకు స్వామివారికి సర్వ అహంకారం, ఆరు గంటల 30 నిమిషాలకు గోత్రనామాలతో విశేష పుష్పార్చన, 6:50 నిమిషాలకు తీర్థ ప్రసాద గోష్టి, అనంతరం ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, 12 గంటల ఒక్క నిమిషానికి కళ్యాణం, 12 గంటల 30 నిమిషాలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం తీర్థ ప్రసాద గోష్టి కి ఏర్పాట్లు సర్వం పూర్తి చేసినట్లు పరుచూరి సుకన్య తెలియజేశారు. స్వామి వారి కళ్యాణం సందర్భంగా నర్రా విజయభాస్కరరావు, సీతారత్నం దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, స్వామివారి కల్యాణ కైంకర్యం, అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవం నర్రా విజయభాస్కర్ రావు దంపతుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు... ఉదయం సాయంత్రం ప్రసాదాలు స్వామి వారికి మహా నైవేద్యం భక్తులు సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని తెలియచేశారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188